teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 182 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 30 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## తిరుమలలో వైకుంఠ ఏకాదశి సంబరాలు

**అర్ధరాత్రి నుంచే ద్వార దర్శనం**
**భక్తుల కోసం అత్యవసర నంబర్లు విడుదల**





## ఆరావళి పరిరక్షణపై
# సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**పాత నిర్వచనం నిలిపివేత.. నిపుణుల కమిటీ ఏర్పాటు**
**పర్యావరణ సమతుల్యతపై నివేదిక కోరిన ధర్మాసనం**
**ఆక్రమణల అడ్డుకట్టే లక్ష్యంగా కొత్త కమిటీకి ఆదేశం**




దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఆరావళి పర్వత శ్రేణుల పరిరక్షణ పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, ఆరావళి పర్వతాల నిర్వచనం, వాటికి సంబంధించి తలెత్తుతున్న వివాదాస్పద అంశాలను లోతుగా పరిశీలించేందుకు ఒక కొత్త నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

## నేను విదేశాల్లో లేను
### కూకట్‌పల్లిలోనే ఉంటున్నా

**ఐబొమ్మ రవి సంచలన వ్యాఖ్యలు**
**కరీబియన్ దీవుల పౌరసత్వంపై క్లారిటీ**
**విదేశాల నుంచి ఆపరేట్.. వార్తలను కొట్టిపారేసిన నిందితుడు**

2





# కృష్ణా జలాల పోరు

## ప్రభుత్వం వర్సెస్ బీఆర్ఎస్

**జనవరి 2 నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు**
**తెలంగాణ హక్కుల సాధనపైనే ప్రధాన చర్చ**

హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): కృష్ణా జలాల్లో వాటాలు, ఒప్పందాలే లక్ష్యంగా ఈ సారి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. జనవరి 2 నుంచి 7 వరకు సెషన్ నిర్వహించనున్నట్టు వెల్లడించింది. జనవరి 4న సెషన్ ఉండబోదని తెలుస్తోంది. కృష్ణాలోని 811 టీఎంసీల జలాల్లో ఏపీకి 12 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం పెట్టి మన రాష్ట్రానికి మరణశాసనం రాసింది బీఆర్ఎ స్ సర్కారు అని, అప్పటి సీఎం కేసీఆర్, నీళ్ల మంత్రి

మిగతా 2 లో



## కేసీఆర్ రాక.. రేవంత్ రియాక్షన్

**అసెంబ్లీలో సీఎం చిట్‌చాట్ హైలైట్స్**
**మాజీ సీఎం నిష్క్రమణపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**
**తన ఛాంబర్‌లో మంత్రులు, విప్‌లతో రేవంత్ రెడ్డి భేటీ**

2

## విశ్వవేదికపై తెలుగోడి సత్తా

- ప్రపంచ చెస్ వేదికపై భారత్ మెరుపులు
- హంపి, అర్జున్‌లకు కాంస్య పతకాలు
- తెలుగు రాష్ట్రాల సీఎంల ప్రశంసలు
- విశ్వనాథన్ ఆనంద్ తర్వాత అరుదైన ఘనత సాధించిన అర్జున్



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఫిడే ప్రపంచ రాపిడ్ చెస్ ఛాంపియన్ షిప్‌లో కోనేరు హంపి, అర్జున్ అద్భుత ప్రదర్శన కనబర్చారు. మహిళల విభాగంలో హంపీ కాంస్య పతకం సాధించారు. మరోవైపు ఓపెన్ విభాగంలో అర్జున్ సైతం కాంస్యం గెలుచుకున్నారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా కోనేరు హంపి, అర్జున్‌ను ప్రశంసించారు. అసాధారణ నైపుణ్యం, పట్టుదల, పోటీతత్వం ప్రదర్శిస్తూ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ లో దేశానికి, తెలంగాణకు గర్వకారణంగా నిలిచారంటూ ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు

మిగతా 2 లో



### ఉద్యమ కళాకారుల పోరాటానికి
## జాగృతి మద్దతు

**సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల కోసం విన్నపం**
**కాంగ్రెస్ సర్కార్‌పై కవిత ధ్వజం**

2

## అసెంబ్లీలో అరుదైన దృశ్యం

- కేసీఆర్‌ను పలకరించిన రేవంత్ రెడ్డి
- కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- సభలో చూపిన గౌరవం మాటల్లోనూ ఉంటే బాగుంటుంది
- రేవంత్ పలకరింపుపై కేటీఆర్ స్పందన

హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. సోమవారం సభలో ఆసక్తికర

మిగతా 2 లో





## ఉత్తమ్‌కు రేవంత్ రెడ్డి సావాస దోషం

**మేము ఏడు అనుమతులు తెచ్చాం..**
**ఈ రెండేళ్లలో మీరు ఒక్కటైనా తెచ్చారా..?**
**అసెంబ్లీలో హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు**

హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్త మాటలు మాట్లాడుతున్నారని ఆయనకు సీఎం రేవంత్ రెడ్డి గాలి సోకినట్లుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఉత్తమ్‌కు రేవంత్ రెడ్డి సావాస దోషం పట్టుకుందన్నారు. సోమవారం

మిగతా 2 లో

## న్యూ ఇయర్ వేడుకలపై ఈగల్ ఫోర్స్ నిఘా

**డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు.. పబ్ లైసెన్సులు రద్దు**
**హైదరాబాద్ వ్యాప్తంగా పోలీసుల ముమ్మర తనిఖీలు**

హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో డ్రగ్స్‌ను కట్టడి చేయడానికి ఈగల్ ఫోర్స్ (తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో) మరిన్ని గట్టి చర్యలు తీసుకుంటోంది. నూతన సంవత్సరం వేడుకలు

మిగతా 2 లో






## పంచాయతీ నిధులపై సర్కారు కీలక నిర్ణయం

**సర్పంచ్, ఉప సర్పంచ్ సంతకాలు ఉంటేనే చెల్లింపులు**
**దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం నిబంధన**

.. వివరాలు 2లో



## మహిళా డ్రైవర్లకు బంపర్ ఆఫర్

**ఉచిత శిక్షణ, లైసెన్స్**
**హైదరాబాద్ సీపీ సజ్జనార్ పిలుపు**

02

# ఆరావళి పరిరక్షణపై "సుప్రీంకోర్టు సంచలన తీర్పు"




న్యూ ఢిల్లీ, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఆరావళి పర్వత శ్రేణుల పరిరక్షణ పై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, ఆరావళి పర్వతాల నిర్వచనం, వాటికి సంబంధించి తలెత్తుతున్న వివాదాస్పద అంశాలను లోతుగా పరిశీలించేందుకు ఒక కొత్త నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. పర్యావరణ పరంగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ పర్వత శ్రేణుల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్, ఆక్రమణలను అరికట్టడమే లక్ష్యంగా కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు సుమోటోగా (స్వచ్ఛందంగా) విచారణ చేపడుతూ కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆరావళి పర్వతాలు విస్తరించి ఉన్న రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. ఈ నాలుగు రాష్ట్రాల స్పందనను కోరుతూ, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. పర్వత శ్రేణుల సరిహద్దులను శాస్త్రీయంగా నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే భూ వివాదాలకు అడ్డుకట్ట వేయాలని ధర్మాసనం భావిస్తోంది.

**పాత నిర్వచనం నిలిపివేత!**

ఆరావళి పర్వతాలు, పర్వత శ్రేణుల నిర్వచనంపై సుప్రీంకోర్టు తన వైఖరిని మార్చుకుంది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన ఆరావళి నిర్వచనాన్ని అంగీకరిస్తూ గతంలో (నవంబర్ 20న) ఇచ్చిన తీర్పును తాత్కాలికంగా నిలిపివేస్తూ చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ నాటి నిర్ణయం అమలులోకి వస్తే, ఆరావళి ప్రాంతంలో మెజారిటీ భాగం మైనింగ్ కార్యకలాపాలకు అనుకూలంగా మారుతుందని పర్యావరణవేత్తల నుంచి వ్యక్తమైన ఆందోళనల నేపథ్యంలో కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

# కేసీఆర్ రాక.. రేవంత్ రియాక్షన్

హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): శాసనసభలో ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్ సోమవారం సభకు వచ్చి త్వరగా వెళ్లిపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ వెంటనే ఎందుకు వెళ్లారన్నది ఆయననే అడగాలన్నారు. ఈ రోజే కాదు ఆసుపత్రిలో కూడా కేసీఆర్ ని నేను కలిశానని గుర్తు చేశారు. సోమవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో శాసన మండలి భవనం పునర్నిర్మాణ పనులను వచ్చే బడ్జెట్ సమావేశాల వరకు పూర్తిచేయాలనుకుంటున్నామని చెప్పారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ మాదిరి సెంట్రల్ హాల్ ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులతో ఇక్కడికి యాక్సెస్ ఉంటుందని మాజీ ఎమ్మెల్యేలలకు కూడా సెంట్రల్ హాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి సభ్యుడిని మేము గౌరవిస్తామని చెప్పారు. మరో వైపు అసెంబ్లీలోని తన ఛాంబర్ లో మంత్రులు, విప్‌లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు.

## అసెంబ్లీలో అరుదైన దృశ్యం

మొదటి పేజీ తరువాయి



పరిణామం చోటు చేసుకుంది. మాజీ సీఎం కేసీఆర్ సోమవారం సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ సీఎం రేవంత్ రెడ్డి కరచాలనం చేశారు. కేసీఆర్ సీటు దగ్గరకు వెళ్లి పలకరించిన రేవంత్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి మాజీ సీఎంను వాకబు చేశారు. ఏళ్ల తర్వాత వీరి కలయిక రాజకీయ వర్గాలను ఆకర్షించింది. నెట్టింట వీడియో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు ఆయన సోమవారం అసెంబ్లీ లాబీలో మీడియా చిట్ చాట్‌లో మాట్లాడుతూ 'కేసీఆర్ అంటే గౌరవం ఉంటే చాలు, తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలోని ప్రతి ఒక్కరికి ఆ గౌరవం ఉంటుంది. సభలో కేసీఆర్‌ని కలిసేంత సంస్కారం సీఎంకు ఉంటే చాలు బయట మాటల్లోనూ ఇదే సంస్కారం ఉంటే బాగుంటుంది. రాజకీయ ప్రత్యర్థులు ఇలా పలకరించుకుంటే మంచిదే' అంటూ కేటీఆర్ చెప్పుకొచ్చారు. అలాగే మీసాలు, గడ్డాలు పెంచడంపైన కేటీఅర్ స్పందించారు. గడ్డం పెంచిన ప్రతి ఒక్కరు ప్రతి ఒక్కడు గబ్బర్ సింగ్ కాలేదు, గడ్డాలు పెంచడం ఈజీ పాలన చేయడమే కష్టం. సీఎం రేవంత్ గడ్డం మీసాలు లేవని నన్ను కాదు రాహుల్, రాజీవ్‌ను అన్నారు. నేను ఆంధ్రాలో చదివితే తప్పు కానీ అల్లుడు ఏపీ నుంచి తెచ్చుకున్నారు అంటూ విమర్శించారు.

# కృష్ణా జలాల పోరు



మొదటి పేజీ తరువాయి

హరీశ్ అని ప్రభుత్వం ఆరోపిస్తోంది. బీఆర్ఎస్ మాత్రం పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 45 టీఎంసీలు చాలని కేంద్రాని కి లేఖ రాసిందని అంటోంది. 90 టీఎంసీల సాధన కోసం పనిచేయాలని డిమాండ్ చేస్తోంది. జలద్రోహం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపిస్తోంది. ఈ అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం అసెంబ్లీని సమావేశ పర్చింది. ఇదే సమయంలో మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సోమవారం అసెంబ్లీలో సమావేశమయ్యారు. సెషన్ ముగిసే వరకు ఎట్టి పరిస్థితిలోనూ అసెంబ్లీకి గైర్హా జరు కావద్దని సూచించారు. నీటి వాటాల విషయంలో మంత్రులు అందరూ అలర్ట్ ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకొనే పనిలో ఉందన్నారు. ప్రతిప క్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు అందరూ సిద్ధంగా ఉ ంటాలన్నారు. పాయింట్‌ఆఫ్ ఆర్డర్ ముఖ్యమని, అవకాశం కోసం అందరూ ఎదురు చూడాలని సూచించారు. అడిగే ప్రతి అంశానికీ సమాధానం ఇవ్వాలని అన్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉ ండగా తాము 32 అంశాలపై చర్చించాలని, కనీసం 20 రోజుల పాటు సభ నడపాలని కోరినట్టు జేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి చెబుతున్నారు. 15 అంశాలపై చర్చకు బీఏసీలో పట్టుబట్టి నట్టు మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పారు. దీంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో కృష్ణ జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఒక వేళ మంత్రి పీపీటీ ఇస్తే తమకూ చాన్సివ్వాలని బీఆర్ఎ పట్టుబట్టుతోంది. ఇదే క్రమంలో బీజేపీ జీహెచ్ఎంసీ విస్తరణపైనా చర్చించేందుకు సమయం కోరుతోంది.

## మహిళా డ్రైవర్లకు బంపర్ ఆఫర్



హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): స్టీరింగ్ పట్టండి స్వశక్తితో ఎదగండని మహిళలకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ శుభవార్త చెప్పారు. ఈ మేరకు ఆయన సోమవారం మహిళలకు ఉపాధి కల్పించే జాబ్ మేళాపై ఎక్స్ వేదికగా వెల్లడించారు. హైదరాబాద్‌లోని మహిళలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా తెలంగాణ మహిళా భద్రతా విభాగం, హైదరాబాద్ పోలీసుల సహకారంతో డ్రైవర్ ఉద్యోగ మేళాను నిర్వహిస్తోందని తెలిపారు. మహిళల భద్రత, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా బైక్ టాక్సీ, ఈ-ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఉచిత డ్రైవింగ్ శిక్షణ & లైసెన్స్ జారీలో సహాయం, డ్రైవింగ్ అనుభవం లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు, వాహన లోన్/ లీజు సౌకర్యం & ఉపాధి కల్పన, అర్హతలు, వయస్సు: 21-45 ఏళ్లు (హైదరాబాద్ వాసులై ఉండాలి), వేదిక: పోలీస్ ట్రైనింగ్ సెంటర్, అంబర్‌పేట్, హైదరాబాద్. జనవరి 3 (శుక్రవారం), సంప్రదించండి: 89788 62299' అని వివరాలు పంచుకున్నారు. ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ సమాచారాన్ని నలుగురికీ తెలిసేలా షేర్ చేయాలని ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఉత్తమ్‌కు రేవంత్ రెడ్డి సావాస దోషం

మొదటి పేజీ తరువాయి



అసెంబ్లీలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన హరీశ్‌రావు పాలమూరు ప్రాజెక్టు కోసం నేల మీద పడుకుని పనిచేశానన్నారు. ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్ళించామని 90 టీఎంసీలను 45టీఎంసీలకు తగ్గించారా లేదా? ఉత్తమ్ చెప్పాలన్నారు. డీపీఆర్ వాపస్ వచ్చి ఏడాది అయినా మౌనం ఎందుకు? అని ప్రశ్నించారు. మా హయాంలో ఏడు అనుమతులు తెచ్చామని మరి ఈ రెండేళ్లలో ఒక్క అనుమతైనా తెచ్చారా? అని నిలదీశారు. పాలమూరు ద్రోహులు కాంగ్రెస్ నేతలు అని దుయ్యబట్టారు.

**కేసులు వేసి అడ్డుకున్న ద్రోహి ఉత్తమ్:**

గ్రీన్ ట్రిబ్యునల్‌లో కోర్టులో కేసు వేసి అడ్డుకున్న ద్రోహి ఉత్తమ్ కుమార్ రెడ్డి అని రెండు టన్నల్స్ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి అయ్యాయన్నారు. మిస్టర్ ఉత్తమ్ మీ చేతకాని తనాన్ని మాపై రుద్దుతున్నారు. కొడంగల్ నారాయణపేట లిఫ్ట్ కు రెండేళ్ల క్రితం కొబ్బరికాయ కొట్టి డీపీఆర్ ఎందుకు పంపలేదు? అని నిలదీశారు. సొంత శాఖపై మంత్రిగా ఉత్తమ్‌కు ఇంకా పట్టు రానట్టుంది. ఇంకెప్పుడు జ్ఞానం పెంచుకుంటాడో అని సెటైర్ వేశారు. ఎస్ఎల్బీసీ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1900కోట్లు ఖర్చు పెట్టింది. ఏడు ప్రాజెక్టులకు ఢిల్లీ నుంచి ఫైనల్ అనుమతులు తెచ్చాం.కాంగ్రెస్ హయంలో 3 డీపీఆర్ లు వాపస్ వచ్చాయన్నారు.

**మాకూ పీపీటీకి చాన్స్ ఇవ్వాలని అడిగాం:**

సభను కనీసం 15రోజులు జరపాలని బీఏసీలో పట్టు పట్టాంమని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. సభను వారం రోజులు జరుపుతామని స్పీకర్ చెప్పారని వారం తర్వాత మళ్ళీ బీఏసీ పిలుస్తామన్నారని తెలిపారు. నదీ జాలలపై సభలో బీఆర్ఎస్ కూడా పీపీటీకి అవకాశం ఇవ్వాలని బీఏసీలో లేవనెత్తామన్నారు. కాంగ్రెస్ వచ్చాక క్వశన్ అవర్ 6రోజులు మాత్రమే పెట్టారు. ప్రతి రోజు క్వశన్ అవర్ పెట్టాలని కోరినట్టు చెప్పారు. అలాగే ఖాళీగా ఉన్న 16హౌస్ కమిటీలు వేయాలని కోరామని, ఎజెండా పంపే పద్ధతి సరిగా లేదని 24గంటల ముందే అజెండా ఇవ్వాలని కోరామన్నారు. 15అంశాలపై సభలో చర్చించాలని పట్టు పట్టినట్లు తెలిపారు.

# నేను విదేశాల్లో లేను కూకట్‌పల్లిలోనే ఉంటున్నా

హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు రవి అరెస్ట్ వ్యవహారంలో ఒక ఆసక్తికరమైన మలుపు తెర మీదకు వచ్చింది. సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీ ముగియడంతో సోమవారం అతడిని కోర్టుకు తరలిస్తుండగా, మీడియా ప్రతినిధులతో రవి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. గత కొంతకాలంగా ఐబొమ్మ రవి విదేశాల్లో తలదాచుకున్నాడని, కరీబియన్ దీవుల్లో నివాసం ఉంటున్నాడని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఈ వార్తలను రవి పూర్తిగా కొట్టిపారేశారు. మీరు విదేశాల్లో ఎందుకు ఉన్నారు? అని రిపోర్టర్ ప్రశ్నించగా నేను ఎక్కడికీ వెళ్లలేదు, ఇక్కడే కూకట్‌పల్లిలో ఉంటున్నాను. ఎవరో చెప్పిన మాటలు నమ్మకండి అంటూ సంచలన సమాధానం ఇచ్చారు. కరీబియన్ దీవుల పౌరసత్వం గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ తాను అక్కడ కేవలం సిటిజన్‌షిప్ (పౌరసత్వం) మాత్రమే తీసుకున్నానని, కానీ తన నివాసం మాత్రం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలోనే ఉందని స్పష్టం చేశారు. ఐబొమ్మ కార్యకలాపాలు విదేశాల నుంచి సాగుతున్నాయని భావించిన పోలీసులకు, రవి సమాధానం కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇక సోమవారంతో రవి పోలీస్ కస్టడీ ముగిసింది. దీంతో నిబంధనల ప్రకారం అతడికి ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు, అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. పైరసీ వెబ్‌సైట్ ద్వారా చిత్ర పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టం చేకూర్చారనే ఆరోపణలపై రవిపై లోతైన విచారణ కొనసాగుతోంది.

# ఉద్యమ కళాకారుల పోరాటానికి జాగృతి మద్దతు

హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం సభ్యులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పనిచేసిన కళాకారులకు తెలంగాణ సాంస్కృతి సారధిలో ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కవితను కోరారు. ఎన్నికల సమయంలో ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు ఇస్తాం అని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు మాకు ఉద్యోగాలు కల్పించలేదని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కళాకారులకు ఉద్యోగాల కోసం ఘోరంగా ఏర్పడి పోరాటం చేస్తున్న కళాకారులకు తెలంగాణ జాగృతి సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ రావడానికి ప్రధాన పాత్ర పోషించిన కళాకారులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కళాకారులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి రెండేళ్లు అవుతున్నా ఇంతవరకు అపాయింట్మెంట్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఇందిరా పార్క్ వద్ద కళాకారులు చేపట్టే ధర్నాలో తెలంగాణ జాగృతి పాల్గొంటుంది అని తెలిపారు.

# విశ్వవేదికపై తెలుగోడి సత్తా

మొదటి పేజీ తరువాయి

సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు సైతం హంపీ, అర్జున్‌లను ప్రశంసించారు. ఒక్క ఫలితంతో ఛాంపియన్లను అంచనా వేయలేమని పేర్కొన్నారు. అత్యున్నత స్థాయిలో పదేపదే పోటీపడే ధైర్యమే వారిని నిలబెడుతుందని తెలిపారు. ప్రపంచ వేదికపై కాంస్యం సాధించడం మీ నైపుణ్యానికి నిదర్శనం ప్రశంసించారు. మీ ప్రయాణం నిలకడ దేశంలోని లక్షలాది మందికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. పురుషుల్లో విశ్వనాథన్ ఆనంద్ తరవాత ఈ ఘనత సాధించిన ఏకైక భారత క్రీడాకారుడిగా అర్జున్ నిలిచాడన్నారు.

# పంచాయతీ నిధులపై సర్కారు కీలక నిర్ణయం

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ నిధుల విషయంలో సర్పంచ్, ఉప సర్పంచ్ ఇద్దరూ సంతకాలు చేసిన చెక్కులకు మాత్రమే చెల్లింపులు చేయాలని సోమవారం ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పారదర్శకత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇద్దరి సంతకాలు ఉంటేనే బ్యాంకులు చెల్లింపులు చేయాలని స్పష్టం చేసింది. పంచాయతీ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మరియు పాలనలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ అధికారులు ఈ నిబంధన అమలయ్యేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా, మూడు విడతల సర్పంచ్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సుమారు 56 శాతం స్థానాలను కైవసం చేసుకుని తన తిరుగులేని ఆధిక్యాన్ని చాటింది. కాంగ్రెస్ 7,010 స్థానాల్లో గెలిచి అగ్రస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ మద్దతుదారులు మొత్తం 3,502 స్థానాలను గెలుచుకోగా, బీజేపీ 688 స్థానాలను తన ఖాతాలో వేసుకుంది. పలుచోట్ల సీపీఎం, సీపీఐ శ్రేణులు కూడా సత్తా చాటారు.

# న్యూ ఇయర్ వేడుకలపై ఈగల్ ఫోర్స్ నిఘా




మొదటి పేజీ తరువాయి

శాంతియుతంగా జరిగేందుకు 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులతో కలిసి తనిఖీలు చేస్తున్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది హైదరాబాద్‌లో డ్రగ్స్ వినియోగం తగ్గిందని అధికారులు చెబుతున్నారు. నగరంలోని పబ్‌లు, హోటల్స్, ఈవెంట్ వేదికలపై అకస్మాత్తు తనిఖీలు నిర్వహిస్తూ, నిబంధనలు పాటించని పబ్‌లకు నోటీసులు జారీ చేస్తున్నారు. డిసెంబర్ 28న కొండాపూర్‌లోని క్వేక్ అరేనా పబ్‌లో దాడులు చేయగా, డీజే కార్యక్రమంలో పాల్గొన్న 8 మందికి డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చింది. వారిపై కేసులు నమోదు చేసి, పబ్ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ 'జీరో డ్రగ్స్' విధానం అమలు చేస్తున్నామని, డ్రగ్స్ దొరికితే పబ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కఠిన చర్యల వల్ల డ్రగ్స్ సరఫరా, వినియోగం గణనీయంగా తగ్గిందని అధికారులు తెలిపారు.

# వీకెండ్ డెస్టినేషన్‌గా ములుగు జిల్లా

## పర్యాటక బ్రోచర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

## పర్యాటక ప్రదేశాల సమాచారంపై పోటీలు



ములుగు జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): పర్యాటక శాఖ 100 ప్రదేశాలను వీకెండ్ డెస్టినేషన్ గా చెయ్యడానికి ఔత్సాహికుల నుండి పర్యాటక ప్రాంతాలను పర్యాటక శాఖ వెబ్సైట్ లో అప్లోడ్ చెయ్యడానికి ఈ పోటీని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా రూపొందించిన పోస్టర్ ను సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో విడుదల చేశారు.

**వీకెండ్ డెస్టినేషన్ గా ములుగు జిల్లా**

రాజధాని హైదరాబాద్ నుంచి రెండు, మూడు గంటల ప్రయాణంలోనే చారిత్రక కట్టడాలు, సాంస్కృతిక వైభవం, అభయారణ్యాలను ఆస్వాదించాలంటే ఉమ్మడి వరంగల్ ను సందర్శించాల్సిందే. కాకతీయుల చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచిన, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయి స్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం, ఘనపురం కోటగుళ్లు, లక్నవరం సరస్సు, పాకాల సరస్సు,భోగత జలపాతం, మేడారం జాతర, ఏటూరునాగరం, తాడ్వాయి అభయారణ్యాలు, పాండవుల గుహలు దేశ, విదేశీ పర్యాటకులు ఇష్ట పడే ప్రాంతాలు చాలా ఉన్నాయి. సాహస క్రీడల ప్రాంతాలు, చరిత్రక లోకల్ ఫుడ్ వరంగల్ కు ప్రత్యేకంగా గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల పరిచయంలో భాగంగా 100 ప్రదేశాలను వీకెండ్ డెస్టినేషన్లుగా మార్చేందుకు పర్యాటక అభివృద్ధి సంస్థ సరికొత్త ప్రయత్నాన్ని ప్రారంభించింది. ఇప్పటికి అంతగా వెలుగులోకి రానివి ఈ జాబితాలో చేరుస్తోంది. ఆయా ప్రాంతాలకు హైదరాబాద్ తో పాటు జిల్లాలను పర్యాటకుల్ని పెంచాలన్నది ప్రధాన లక్ష్యం.

**వీకెండ్ ట్రిప్ ప్లాన్స్**

వీకెండ్ ట్రిప్ లపై ఆసక్తి ఉన్నవారు హైదరాబాద్లోనే సుమారు 10 లక్షల మంది ఉంటారని పర్యాటక సంస్థ అంచనా వేసింది. ప్రధానంగా ఐటీ ఉద్యోగులతోపాటు వర్సిటీల్లో విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేస్తున్న వారు తమ స్నేహితులు, కుటుంబాలతో ప్రయాణాలకు ఆసక్తి చూపిస్తున్నారని గుర్తించింది. ఈ 'హైపర్ లోకల్ టూరిస్టు'లను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి 50–250 కి.మీ. దూరంలో 100 వారాంతపు పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సేకరిస్తోంది. ప్రధానంగా శని, ఆదివారాలు లేదా ఇతర సెలవు రోజుల్లో ఒకట్రెండు రోజులు సరదాగా వెళ్లివచ్చే ప్రదేశాలను ఈ జాబితాలో చేరుస్తోంది. ఆయా ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ, సమీపంలోని వసతి సదు-పాయాలు అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్, స్థానిక వంటకాలు వంటి పూర్తి సమాచారాన్ని పర్యాటక సంస్థ అధికారులు సేకరిస్తున్నారు.

**100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' పోటీలకు ఆహ్వానం**

రాష్ట్రంలోని అద్భుతమైన పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించే విధంగా '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు టూరిజం డెవల ప్మెంట్ కార్పొరేషన్ ఎండీ వల్లూరు క్రాంతి వెల్లడించారు. తెలంగాణలోని పర్యాటక ప్రదేశం స్పష్టంగా కనిపించేలా 3 ఫొటోలు, 60 సెకెన్ల వీడియో, వంద పదాల్లో ప్రత్యేకతను వివరిస్తూ జన వరి 5లోగా ఎంట్రీలను పంపాలని సూచించారు. అందులో హైదరాబాద్ నుంచి కనెక్టివిటీ, వసతి తది తర వివరాలను తెలియజేయాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు ఇస్తామన్నారు. పది మందికి కన్సొలేషన్ బహుమతులు అంద జేస్తామన్నారు. సంక్రాంతి రోజున కైట్ ఫెస్టివల్లో బహుమతులను ప్రదానం చేస్తారు. ఈ పోస్టర్ ను విడుదల కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి యం శివాజీ, డి పి ఆర్ ఓ రఫిక్ , టూరిజం ఇన్ఫర్మేషన్ ఎస్ స్టంట్ కుసుమ సూర్య కిరణ్ పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్లు రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్ లతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 59 దరఖాస్తులు వచ్చాయి. భూ సమస్యలు 12, గృహ నిర్మాణ శాఖకు 08, పెన్షన్ 09, ఉపాధి కల్పనకు 05, ఇతర ఇతర శాఖలకు సంబంధించినవి 25 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగులకు వివాహ నగదు ప్రోత్సాహ పథకం

**జిల్లా సంక్షేమ అధికారి సబిత**



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల వయోవృద్ధుల మరియు ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సంక్షేమ శాఖ, హైదరాబాదు వారి ఆదేశాల మేరకు దివ్యాంగులు, సకలాంగుల మధ్య వివాహానికి మరియు దివ్యాంగులు, దివ్యాంగుల మధ్య వివాహానికి 1 లక్ష రూపాయల నగదు ప్రోత్సాహంగా అందజేస్తుందని జిల్లా సంక్షేమ అధికారి సబిత నేడు ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు వివాహం జరిగిన సంవత్సరంలోపు www.telangana.epass.gov.in వెబ్సైట్ నందు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# యూరియా యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలి

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల**





మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన యూరియా యాప్ ను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచనల మేరకు ఈరోజు నుండి జిల్లా వ్యాప్తంగా యాప్ ను అమలులోకి తేవడం జరుగుతుందని, భూమిలో సాగు చేస్తున్న రైతు, కౌలు రైతు వివరాలు నాన్ డిఎస్ రైతులు తమ ఫోన్ నెంబర్ లేదా ఆధార్ ద్వారా మొబైల్ ఫోన్లో లాగిన్ అయి పంట వివరాలు నమోదు చేయాలని, జిల్లాలో ఎరువులు, డీలర్లు, జాబితా వారి వద్ద అందుబాటులో ఉన్న యూరియా స్టాక్ వివరాలు ఈ నూతన యాప్ లో కనిపిస్తాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత సిబ్బంది రైతులకు పూర్తి అవగాహన కల్పించి యాప్ ద్వారా బుక్ చేసుకోవడం నేర్పించాలని ఆమె తెలిపారు. ఈ రోజు జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేసిన మడికొండ బ్రదర్స్



పరకాల, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): పరకాల మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డులోని సిఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన టిపిసిసి ఎస్సి విభాగం వైస్-చైర్మన్ డాక్టర్. మడికొండ శ్రీను, స్థానిక మాజీ కౌన్సిలర్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మడికొండ సంపత్ కుమార్. వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, ప్రతి ఒక్కరూ శ్రద్ధతో చదువుకోవాలని, పేదరికానికి చదువు అడ్డుకాదని, విద్యతోనే పేదరికంని జయించవచ్చని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, చదివిన పాఠశాలకు, సొంత ఊరికి పేరు ప్రతిష్టలు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ఏబ్బి మేడం, అటెండర్ మడికొండ ఐలయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్త 33/11 కెవి నార్లాపూర్ సబ్ స్టేషన్ ఛార్జ్ చేయాలి

## మేడారం పార్కింగ్ కొరకు ఏర్పాటు చేసే స్థలాల పరిశీలన

## మేడారం గద్దెల వద్ద 4 పోల్ల స్ట్రక్చర్ పనుల పరిశీలన

## జాతర విద్యుత్ సరఫరాపై సూచనలు చేసిన ఎన్పీడీసీఎల్ సీఎండీ



తాడ్వాయి, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): మేడారం జాతరకు విద్యుత్ సరఫరా పనులను జనవరి 5 వరకు పూర్తి చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. మేడారంలో జరుగుతన్న విద్యుత్ పనులను సోమవారం పర్యవేక్షించారు. ముందుగా జాతర కొరకు కొత్తగా నిర్మిస్తున్న33/11 కెవి నార్లాపూర్ సబ్ స్టేషన్ ను సందర్శించి జనవరి 10 వరకు ఛార్జ్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా కొరకు మేడారం టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన 4 పోల్ ల స్ట్రక్చర్ పనులను పరిశీలించారు. కాలానుగుణంగా నిర్దేశించుకున్న పనులన్ని పూర్తి చేయాలని సూచించారు. మేడారం పార్కింగ్ కొరకు ఏర్పాటు చేసే వెంగళాపూర్, చింతల్ క్రాస్ రోడ్, నార్లాపూర్ స్థలాలను పరిశీలించి తగు సూచనలు చేసారు. అలాగే స్తూపం జంక్షన్, హరిత జంక్షన్, ఆర్టీసీ జంక్షన్, కన్నెపల్లి రోడ్, కన్నెపల్లి దేవాలయం పరిసర ప్రాంతాలు క్షుణంగా పరిశీలన చేసి, ఎక్కడ అంతరాయం లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. అనంతరం పస్రా సెక్షన్ ఆఫీస్లో కొత్తగా నిర్మిస్తున్న కంట్రోల్ రూం, డ్యూటీ రూమ్ నిర్మాణం పనులను నేరుగా పర్యవేక్షించారు. అలాగే గట్టమ్మ ఆలయం వద్ద కొత్తగా నిర్మిస్తున్న 33/ 11 కెవి సబ్ స్టేషన్ కూడా జాతర వరకు అందుబాటులోకి రావాలని అన్నారు. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ముందుగానే అన్ని పనులు పూర్తి చేయాలని, జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ కె. రాజు చౌహాన్, ములుగు ఎస్ఈ ఆనందం, డిఈ ములుగు పి నాగేశ్వర రావు, డిఈ సదానందం, అనిల్ కుమార్, ఈ ఈ సివిల్ వెంకట్ రామ్, ఏడీఈ లు, రాజేష్ , వేణుగోపాల్, సందీప్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో**



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. సోమవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, అన్ని విభాగాల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాల కు పంపి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సోమవారం వివిధ విభాగాలకు చెందిన మొత్తం (86) ప్రజావాణి దరఖాస్తులు వచ్చాయన్నారు. డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన తోట బిందు తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరారు. మహబూబాబాద్ కు చెందిన ఏం. రాజేష్, జిల్లాలో ఎస్సారెస్పీ కెనాల్, కాలువల ప్రక్కన ప్రభుత్వ భూములు కబ్జా గురి అవుతున్నాయని అట్టి భూములను సంరక్షించాలని దరఖాస్తు చేశారు, నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన తూళ్ళ సురేష్ తన తండ్రి పేరు మీద గల ఒక ఎకరం భూమిని అక్రమంగా టి.రవి కుమార్ అను వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసుకొని వారి తండ్రి పేరు మీద వచ్చిన ఇందిరమ్మ ఇల్లుని అట్టి స్థలంలో అక్రమంగా నిర్మించుకున్నందున అట్టి నిర్మాణాన్ని నిలుపాలని కోరారు.

కేసముద్రం మండలం రంగాపురం గ్రామపంచాయతీ సింగిలాల్ తండాకు చెందిన దారావత్ బాల్ సింగ్ తనకున్న 9 ఎకరాలలో మొక్క జొన్న పంట వేసియున్నానని అందుకు సరిపడా యూరియా ఇప్పించాలని కోరారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన పోతుగంటి వెంకటేశ్వర్లు గుండ్రాతి మడుగు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లలో తనకున్న ఎకరం 25 గుంటలకు సర్వే కోసం రెవెన్యూ అధికారికి పలు పర్యాయాలు దరఖాస్తు పెట్టుకున్న పట్టిచ్చుకోవట్లేదని అట్టి భూమిని సర్వే చేపించి ఇవ్వగలరని కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పి సీఈవో పురుషోత్తం, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.మరియన్న,ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, దేశి రామ్ నాయక్, శ్రీనివాసరావు, శ్రీనివాస్, డిపిఓ హరిప్రసాద్, ఎల్డిఎం యాదగిరి, వెల్ఫేర్ అధికారిని సబిత, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, మెప్మా ప్రాజెక్ట్ అధికారిని విజయ, పరిశ్రమల శాఖ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, సివిల్ సప్లై కృష్ణవేణి, డీఎస్ఓ రమేష్, అన్ని విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు

## సమృద్ధిగా నిల్వలు అందుబాటులో ఉన్నాయి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): జిల్లాలో యూరియా కొరత లేదని, సమృద్ధిగా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో యూరియా సరఫరా, విక్రయాలు తదితర అంశాలపై రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు మండల ప్రత్యేక అధికారులు, టాస్క్ ఫోర్స్ టీములు, డివిజన్ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచే యూరియా అమ్మకాలు ప్రారంభించాలని సూచించారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద ప్రారంభ, ముగింపు నిల్వలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి విక్రయ కేంద్రం వద్ద అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో సహకార శాఖ ద్వారా 10 కేంద్రాలున్నాయని, అదనంగా 22 విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఏఆర్ఎస్కే ద్వారా 18, డీసీఎంఎస్ ద్వారా 27, హాకా ద్వారా 12, రిటైలర్ల ద్వారా 327 కేంద్రాలలో యూరియా విక్రయాలు జరుగుతున్నాయని వివరించారు. జిల్లాలో 2967 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టంచేశారు. జిల్లాలో వరి, మొక్కజొన్న కలిపి మొత్తం 10 రకాల పంటలు 1,26,805 ఎకరాల్లో సాగవుతున్నాయని తెలిపారు. యూరియా పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏదేని సహాయతకు వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన 7893098307 కంట్రోల్ రూము నంబర్ కు కాల్ చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ శాఖ ఏడీఏ, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిబి రహిత జిల్లా లక్ష్యంగా పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో అల్ట్రా పోర్టబుల్ ఎక్స్‌రే మెషీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానిత టిబి కేసుల స్క్రీనింగ్ చేసేందుకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సెంట్రల్ టిబి డివిజన్ నుంచి జిల్లాకు అల్ట్రా పోర్టబుల్ ఎక్స్‌రే మెషీన్ మంజూరు చేశారని తెలిపారు. ఈ ఎక్స్‌రే మెషీన్ ప్రధాన ఉద్దేశం జిల్లాలో గ్రామ స్థాయిలోనే అనుమానిత టిబి గ్రస్తులకు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించడం ద్వారా టిబి వ్యాధిని తొందరగా గుర్తించి చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా 60 సంవత్సరాలు దాటిన వ్యక్తులు, షుగర్ వ్యాధి గ్రస్తులు, మద్యం మరియు పొగతాగే వారు, గత ఐదు సంవత్సరాల్లో టిబి బారిన పడి నయమైన వారు, ప్రస్తుతం టిబి చికిత్స పొందుతున్న రోగుల కుటుంబ సభ్యులు, ఎత్తుకు సరిపడ బరువు లేని వారు ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని లక్ష్యంగా పెట్టుకుని స్క్రీనింగ్ చేయనున్నట్లు తెలిపారు.

అదేవిధంగా రెండు వారాలకు మించి దగ్గు, తెమడలో రక్తం పడటం, అలసట,నీరసం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పులు, శరీర భాగాల్లో గుల్లలు లేదా వాపు, ఛాతిలో నొప్పి, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు టిబి అనుమానితులుగా భావించి ఇక నుంచి గ్రామ స్థాయిలోనే ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, క్షయ వ్యాధి ప్రోగ్రామ్ అధికారి డా. ఉమాదేవి, డా. దేవేందర్, డా. రాజేష్, డీపీవో చిరంజీవి, టిబి సూపర్వైజర్ శ్రీకాంత్, ఇన్చార్జ్ డీపీసీ గణేష్, రేడియోగ్రాఫర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సమయానికి బస్సులు లేక ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు




భూపాలపల్లి, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీలో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో మహిళా ప్రయాణికుల రద్దీ తీవ్రంగా పెరిగింది. కనీసం నిల్చోడానికీ బస్సుల్లో స్థలం ఉండటం లేదు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచడంలో గోదావరిఖని,మంథని,డిపో అధికారులు విఫలమయ్యారు. భూపాలపల్లి నుండి గోదావరిఖనికి 5 డిపోలకు చెందిన బస్సులు తిరుగు తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సామాన్య ప్రయాణికులు తమ తమ అవసరాల నిమిత్తం భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, కాళేశ్వరం ఈ రూటులో నిత్యం వేలాది మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం ప్రారంభించిన తర్వాత ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెరగాల్సింది పోయి అంతకుముందు కంటే బస్సులు క్రమ క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. భూపాలపల్లి, రూట్లో ప్రైవేట్ అద్దె బస్సులు బస్సులు ఎక్కువగా తిరుగుతాయి, అగ్రిమెంట్ ఐపోయిన అద్దె బస్సుల స్థానంలో సంస్థ బస్సు నడపాల్సింది పోయి మాకేం సంభంధం లేదన్నట్టు వ్యవహరించడం వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. దానికితోడు పొద్దంతా ఒకదాని వెంట మరోటి నడుస్తున్న బస్సులు చీకటి పడగానే ఒక్కటీ కనబడటం లేదు. ముఖ్యంగా భూపాలపల్లి బస్టాండ్ నుండి గోదావరిఖని కి సాయంత్రం 5:40 నిమిషాలకు బస్సు వెళ్లిపోయిందంటే మళ్ళీ రాత్రి 7వరకు గంటా ఇరవై నిమిషాలు బస్సు లేదు. ఇక అదే చివరి బస్సు. రెండు మూడు నెలల క్రితం వరకు రాత్రి 7:30కి మణుగూరు డిపోకి చెందిన ఎక్స్‌ప్రెస్ బస్ ఉండగా డిపో అధికారులు దానిని క్యాన్సిల్ చేసి ఇప్పుడు దాని స్థానంలో సూపర్ లగ్జరి బస్సు నడుపుతున్నారు. సూపర్ లగ్జరీ బస్సులో మహాలక్ష్మి పథకం వర్తించని కారణంగా రాత్రి 7గంటల బస్సే అందరికీ చివరి బస్సు అయ్యింది. ప్రతీరోజూ చచ్చి చెడి అదే బస్సులో 100 నుండి 120 మంది వరకు ప్రయాణం సాగించాల్సి వస్తుంది. ఒక్కోసారి బస్సు లోపలికి ఎక్కలేక కొంతమంది ఆగిపోవాల్సి వస్తుంది. ఏ ప్రయివేటు వెహికిల్ లోనో ప్రయాణం చేయాల్సి వస్తుంది. అంతే గాక ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన కాళేశ్వరం వెళ్లి తిరుగుముఖంలో కరీంనగర్ వైపు రావాల్సిన ప్రయాణీకులు సైతం కాటారం లో దిగి గోదావరిఖని, మంథని బస్సుల కోసం ఎదురు చూడవలసి వస్తుంది. గోదావరిఖని, మంథని, భూపాలపల్లి,మూడు బస్ డిపోలు ఉన్నప్పటికీ ఏ ఒక్క డిపో వారు కూడా సమయానికి బస్సులు నడపలేకపోతున్నారు.

సాయంత్రం నాలుగు గంటలకు భూపాలపల్లి నుండి మంథని, గోదావరిఖని, డిపోలకు వెళ్ళవలసిన బస్సులు మూడు, నాలుగు నిమిషాల వ్యవధిలోనే ఒక బస్సు వెన కాలే మరొక బస్సు ఖాళీగా వెళ్తున్నాయి, అలా కాకుండా 15 నుండి 20 నిమిషాల వ్యవధిలో తిరిగితే ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణీకులు కోరుతున్నారు.

# ప్రజావాణి పరిష్కారం మోస్ట్ అర్జెంట్ వర్క్ ఆఫ్ ది పీపుల్

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారం మోస్ట్ అర్జెంట్ వర్క్ ఆఫ్ ది పీపుల్ అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల యొక్క సమస్యల దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో ఆశతో తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో అందజేస్తారని, వాటిని అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని సత్వర పరిష్కారం చూపడం అధికారుల బాధ్యతని స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చాలా దూర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలు వినిపిస్తున్నారని, వారి నమ్మకానికి తగ్గట్లుగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి అనేది కేవలం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కాకుండా, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే ముఖ్యమైన వేదికగా భావించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా స్వీకరించిన 48 దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రతి సోమవారం సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ప్రజావాణికి మొత్తం 56 దరఖాస్తులు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నృత్యాంగానా అవార్డు అందుకున్న పంజాల హాసిని




హనుమకొండ డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా గోపాలపూర్ కి చెందిన పంజాల మహేందర్ ఆమనీ కుమార్తె కూచిపూడి, కథక్ నృత్యాకారిని కుమారి పంజాల హాసిని, నృత్యంజలి సంస్థ న్యూ ఢిల్లీ లో నిర్వహించిన 9వ అంతర్జాతీయ శాస్త్రీయ నృత్య పోటీలు మరియు ఫెస్టివల్ లో కూచిపూడి నృత్య విభాగం నుండి నృత్యాంగానా అవార్డు అందుకోంది, దేశ విదేశాల నుండి వివిధ కళలలో అత్యంత ప్రతిభ కనపరుస్తున్న శాస్త్రీయ నృత్య కళాకారులను గుర్తించి ఈ అవార్డును అందచేశారు ఏమేరకు అదివారం రాత్రి లాజ్పాట్ ఆడిటోరియం న్యూ ఢిల్లీలో డా. కేజీ సురేష్ డైరెక్టర్ అఫ్ ఇండియా హాబిటేట్ సెంటర్ చేతుల మీదుగా అవార్డును హాసిని అందుకున్నట్లు ఎన్ సీ ఎన్ కళాక్షేత్రం గురువు కొంతం వెంకటేశ్వర్లు, అదే విధంగా , నంద్యాల డిఫెన్స్ అకాడెమీ గోపాలపూర్ డైరెక్టర్స్ అయిలి వంశీ కృష్ణ, గూడెపు శివాజీ, పోతుల లెనిన్ కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు సమావేశం నిర్వహించాలి

## రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

## బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షులు బుచ్చన్న యాదవ్



కరీంనగర్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): బీసీలకు విద్య, ఉద్యోగ రంగాలతో పాటు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం బీసీ రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలంటూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో డీఆర్వో వెంకటేశ్వర్లుకి ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బుచ్చన్న యాదవ్, పిట్టల సమ్మయ్యలు మాట్లాడుతూ, బీసీలకు విద్యా%-%ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించి, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపి ఏడు నెలలు గడుస్తున్నప్పటికీ ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకుని తెలంగాణ శాసనసభ్యులు, రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఢిల్లీ వెళ్లి చర్చిస్తామని చెప్పిన హామీలు ఇప్పటివరకు ఆచరణలోకి రాలేదని విమర్శించారు. రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టాన్ని కేంద్రం పట్టించుకోకపోవడం చూస్తే బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తెలంగాణ నుంచి కేంద్రంలో ఉన్న బీజేపీ మంత్రులు, ఎంపీలు చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రధానమంత్రిని ఒప్పించి బీసీ రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని, లేకపోతే బీసీ సమాజం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని చేపడుతుందని బుచ్చన్న యాదవ్, పిట్టల సమ్మయ్యలు హెచ్చరించారు. ఈ వినతిపత్రం సమర్పణ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కోశాధికారి పైడిపల్లి రాజు, కార్యవర్గ సభ్యులు కే. సదానందం, రేగుల కుమార్, జి. లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు

**ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్**




జనగాం జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తిస్థాయిలో కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాలకు అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రైతులకు సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా యూరియా పంపిణీ జరిగేలా ప్రతి ప్రభుత్వ యూరియా పంపిణీ కేంద్రం ముందు తప్పనిసరిగా శామియానా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకే కౌంటర్ వద్ద రద్దీ ఏర్పడకుండా, ప్రతి కేంద్రంలో అవసరానికి అనుగుణంగా బహుళ కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి యూరియా విక్రయ కేంద్రంలో యూరియా బుకింగ్ యాప్‌కు సంబంధించిన %ు=% కోడ్‌ను స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. తద్వారా రైతులు సులభంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. విక్రయ కేంద్రాలకు యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అంతరాయం లేకుండా స్టాక్‌ను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, అవసరమైన యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా చేపడతామని తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే రాగ్యా నాయక్ సేవలు మరువలేనివే



సూర్యాపేట, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): లంబాడి జాతికి మాజీ ఎమ్మెల్యే రాగ్య నాయక్ చేసిన సేవలు మరువలేనివని ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లూనావత్ పాండు నాయక్, ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ పార్టీ చివ్వెంల మండల అధ్యక్షులు, ధరావత్ వీరన్న నాయక్ లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బంజారా భవన్ లో ఏఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు గుగులోతు నాగు నాయక్ అధ్యక్షతన రాగ్య నాయక్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన లంబాడీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీనీ వేదికగా చేసుకొని రాగ్య నాయక్ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆ ప్రాంత అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది అన్నారు. మావోయిస్టుల కాల్పుల్లో ఆయన మరణించడం లంబాడ జాతికి తీరని లోటు అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్, ప్రతి లంబాడి బిడ్డ కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐబిఎస్ఎస్ యూత్ అధ్యక్షులు లావుడ్య బాలాజీ నాయక్, సంఘం పట్టణ అధ్యక్షులు భూక్యా మహేష్ నాయక్, నాయకులు వివి నాయక్, అజయ్ నాయక్, బబ్బులాల్ నాయక్, ధారసింగ్ నాయక్, హరి నాయక్, రెడ్డి నాయక్, గుగులోతు వెంకన్న నాయక్, పాండు నాయక్, చత్రు నాయక్, రాజేష్ నాయక్, పాండు నాయక్, లోకా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



తల్లాడ, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలో ఈరోజు ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది అంజనా పురం గ్రామ శివారులో లారీ, కారు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. కారులో ఐదుగురు విశాఖ పట్నం నుంచి ఖమ్మం వైపు వెళుతుండగా, లారీ తల్లాడ నుంచి సత్తుపల్లి వైపు వెళ్తోంది. ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొనడంతో బాలకృష్ణ (30), అనిల్(31) ఘటనా స్థలంలో చనిపోయారు. మరో ముగ్గురు గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష గోడ పత్రిక ఆవిష్కరణ

**జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పి.పింకేష్ కుమార్**



జనగాం జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఉమ్మడి ప్రవేశ పరీక్ష ప్రకటనకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఇన్చార్జి కలెక్టర్ పి.పింకేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బీసీ, జనరల్ గురుకులాల్లో ప్రభుత్వం ప్రకటించిన అన్ని సీట్లు భర్తీ అయ్యేలా ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విధంగా గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అందరూ విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి కలిగిన విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగిలిపోయిన ఖాళీలలో ప్రవేశాల కోసం ఆసక్తి కలిగిన విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఎస్సీ గురుకులంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్(బాలురు), జగద్గిరిగుట్ట సైనిక్ స్కూల్ (బాలికలు), మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్ లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి కలిగిన విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తుంది. పైన పేర్కొన్న అన్ని ప్రవేశ పరీక్షలకు ఆసక్తి కలిగిన విద్యార్థులు మీ యొక్క దరఖాస్తుని https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్లైన్లో మాత్రమే సమర్పించాలి. పైన పేర్కొన్న అన్ని ప్రవేశ పరీక్షలకు

- దరఖాస్తు రుసుము : రూ. 100,
- దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ : 21.01.2026
- పరీక్ష నిర్వహణ తేదీ : 22.02.2026
- దరఖాస్తు చేసుకొనుటకు కావలసినవి :

1. కులము సర్టిఫికేటు నెంబరు
2. ఆదాయము సర్టిఫికేటు నెంబరు
3. ఆధార్ కార్డు నెంబరు
4. బర్త్ సర్టిఫికేట్
5. విద్యార్థి ఫోటో

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) పి.బెన్ షాలోమ్, డీఎస్ఈ డివో డా.విక్రమ్, అసిస్టెంట్ బిసిడిఓ రవీందర్, బీసీ వెల్ఫేర్ డిసిఓ ఎ.శ్రీనివాస్, జనగామ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల డిసిఓ పి.శ్రీనివాసరావు, జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆర్ట్ టీచర్ వేణుమాధవ్, జూనియర్ అసిస్టెంట్ అజయ్ పాల్గొన్నారు.

# దరఖాస్తులు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**





వరంగల్ జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ శాఖలకు సంబంధించిన తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించగా, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 151 దరఖాస్తులు అందాయి. వాటిలో రెవెన్యూశాఖకు 82, జిడబ్ల్యూఎంసి కు 30 రాగా ఇతర శాఖలకు సంబంధించిన 39 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి, త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో కొంత మంది వృద్ధ తల్లిదండ్రులు తమ పిల్లలు పట్టించుకోవడం లేదని జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకోగా సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుండి వచ్చిన వినతులను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని, పరిష్కరించలేని దరఖాస్తుల విషయంలో ఎందుకు పరిష్కరించలేకపోయామో దరఖాస్తుదారుడికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, నర్సంపేట మరియు వరంగల్ ఆర్డీవోలు సుమ, ఉమారాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సాంబశివ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో గ్రంధాలయం ఏర్పాటు చేయాలి



చిట్యాల, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): మండల కేంద్రంలో అన్ని వసతులతో కూడిన నూతన గ్రంథాలయం ఏర్పాటు చేయాలని పోటీ పరీక్షల కోసం నిరుద్యోగులు చదువుకునే విధంగా గ్రంథాలయంలో అన్ని రకాల పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ తో పాటు వసతులు సమకూర్చే విధంగా నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించాలని అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు గోల్కొండ సురేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం చిట్యాల మండల తాసిల్దార్ కు మండల కేంద్రంలో నూతన గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ గ్రామాన గ్రంథాలయాలు ఏర్పాటు చేయుటకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల కేంద్రంలో శాఖ గ్రంధాలయం గ్రామపంచాయతీలో చిన్న రూములో నిర్వహించడం వల్ల పాఠకులకు ఇబ్బందికరంగా ఉందని గ్రామ పంచాయతీ భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో పాఠకులు భయంతో పత్రికలు తదితర పుస్తకాల పఠనం చేస్తున్నారని తెలిపారు. మండల కేంద్రంలో నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని అంతవరకు వేరే నూతన భవనంలో ప్రస్తుత శాఖ గ్రంధాలయాన్ని ఏర్పాటుచేసి అన్ని పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలని దానికోసం ప్రజాప్రతినిధులు అధికారులు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు ఫోన్లతో కాకుండా పుస్తకాలతో గడిపినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. గ్రంధాలయాలకు తరచుగా వెళ్లి పుస్తక పఠనం చేయడం వలన మంచి విజ్ఞానవంతులు కావచ్చు అని తెలిపారు. కొంతమంది నిరుద్యోగులు పోటీ పరీక్షల కోసం బయట ప్రైవేట్ సంస్థల్లో కోచింగ్ తీసుకోలేని వారు గ్రంధాలయాల్లో ఉచితంగా ప్రిపేర్ అయ్యేందుకు సంబంధిత పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉండే విధంగా గ్రంధాలయం ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జ్ఞానాన్ని పెంపొందించడానికి సామాజికంగా ప్రజలను విద్యార్థులను చైతన్యవంతం చేయడంతో పాటు జ్ఞానవంతులుగా తయారు చేసేందుకు అధునాతనమైన అన్ని వసతులతో కూడిన గ్రంధాలయాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయడానికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రజా అధికారులు నాయకులు కృషి చేయాలని సురేష్ కోరారు. ఈ కార్యక్రమం లో వంశీ కృష్ణ, సాయి పాల్గొన్నారు.

# 100శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే ట్రైనింగ్స్

**బయలుదేరిన భద్రాద్రి జిల్లా యువత**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం ఆద్వర్యంలో జిల్లాలో యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో LSC మరియు Redington Foundation (COLTE) సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, 100 శాతం ప్లేస్‌మెంట్ సపోర్ట్ ప్రోగ్రాం కు సెలెక్ట్ ఐన యువతి యువకులు (26) మందినిలి ఈ రోజు 28.12.2025 న కలెక్టరేట్ నుండి వారికోసం ప్రత్యేకంగా బస్ ఏర్పాటు చేసి హైదరాబాద్ ట్రైనింగ్స్ కు పంపించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని పేద కుటుంబాలకు చెందిన యువతి యువకులు ఈ లాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రపంచం లో వేగంగా అభివృద్ధి చెందుతూ ఎక్కువ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న రంగం లాజిస్టిక్స్, ఎక్సపోర్ట్ %ఽ% ఇంపోర్ట్ రంగమని, ఈ రంగంలో 100శాతం ప్లేసెమెంట్ సపోర్ట్ ఉన్నందున ప్రతిఒక్కరు ట్రైనింగ్ తీసుకోని ఉద్యోగం పొందాలని, మీ కుటుంబ సభ్యులు గర్వ పడేలా, జిల్లాకు ఆదర్శవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# తిరుమలలో వైకుంఠ ఏకాదశి సంబరాలు

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తిరుమలలో వైకుంఠ ఏకాదశి వేడుకలకు సర్వంసిద్ధమైంది. భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేశారు. శ్రీవారి ఆలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. సోమవారం అర్ధరాత్రి 12.05 గంటలకు తిరుప్పావై పాశురాలతో ఆలయంలోని బంగారు వాకిలి తలుపులను తెరవనున్నారు. వైకుంఠద్వారం వద్ద అర్చకులు పూజలు, హారతి సమర్పించనున్నారు. తోమాలపటంతో ప్రదక్షిణగా గర్భాలయానికి చేరుకుని మూలవిరాట్టుకు పుష్ప సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారికి నిత్య పూజా కైంకర్యాలు ఏకాంత సేవలు నిర్వహిస్తారు.1. 30గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుస్తారు. ఆ తర్వాత శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. దీంతో వైకుంఠ ఏకాదశి స్వామి వారి దర్శనాలు ప్రారంభవుతాయి. జనవరి 8వరకు ఈ దర్శనాలు కొనసాగుతున్నాయి. అయితే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా టీటీడీ ఏర్పాటు చేసింది. ఏదైనా ఇబ్బంది కలిగినా లేదా సమాచారం కావాలన్నా సంప్రదించవలసిన ముఖ్యమైన అత్యవసర ఫోన్ నంబర్లను కూడా ఏర్పాటు చేసింది. ఈ నెంబర్లను ఫోన్‌లో సేవ్ చేసుకోవాలని భక్తులకు సూచించింది.



**ప్రధాన సహాయ కేంద్రాలు (24/7 లభ్యత)**

టీటీడీ హెల్ప్ లైన్ (టోల్ ఫ్రీ): 155257

విచారణ కార్యాలయం: 0877-2277777

వైద్య సహాయం

తిరుమలలో అస్వస్థతకు గురైతే వెంటనే కింది నంబర్లను సంప్రదించండి:

అశ్విని ఆసుపత్రి (తిరుమల): 0877-2263457 / 2263458

అంబులెన్స్ సేవలు: 0877-2263666 (లేదా నేరుగా 108 కి డయల్ చేయండి)

మెయిన్ హాస్పిటల్ (తిరుపతి): 0877-2287777

భద్రత మరియు పోలీస్

దొంగతనాలు జరిగినా లేదా ఎవరైనా తప్పిపోయినా వీరిని సంప్రదించండి:

విజిలెన్స్ ఆఫీస్ (టీటీడీ సెక్యూరిటీ): 0877-2263333

తిరుమల క్రైమ్ పార్టీ: 0877-2263939

తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్: 0877-2263833

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్: 0877-2263733

కళ్యాణకట్ట (తలనీలాలు): 0877-2263222

అన్నప్రసాదం సెంటర్: 0877-2263555

**ముఖ్యమైన సూచనలు.**

తప్పిపోయిన వారు: మీ కుటుంబ సభ్యులు ఎవరైనా తప్పిపోతే వెంటనే దగ్గరలోని విజిలెన్స్ ఆఫీసుకి వెళ్లి అనౌన్స్‌మెంట్ చేయించండి. తిరుమలలో దాదాపు అన్ని చోట్లా ఆన్‌లైన్ పేమెంట్స్ అందుబాటులో ఉన్నాయి. కానీ నెట్‌వర్క్ సమస్యల దృష్ట్యా లేదా ఒక్కొక్కసారి సర్వర్లు పనిచేయకపోవడం వలన కొంత నగదు చేతిలో ఉంచుకోవడం ఉత్తమమని టీటీడీ అధికారులు తెలిపారు.

## రాంకీ ఇన్ ఫ్రాలో హౌసింగ్ బోర్డు ద్వారా ఎల్ ఐ జి వర్గాల కోసం 102 ఫ్లాట్లు

**సందేహాల నివృత్తి - అవగాహన నిమిత్తం అధికారుల రాక**




వరంగల్ జిల్లా, డిసెంబరు 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణా హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలో అల్పాదాయ వర్గాల కోసం ఎల్ ఐ జి ఫ్లాట్ల ను అందుబాటులోకి తెచ్చారు. వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న వారు జనవరి 3 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫ్లాట్లను 8వ తేదీన లాటరీ విధానంలో కేటాయిస్తామని హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ సి.వి.రమణారెడ్డి, కార్యదర్శి ఎస్.విమల ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు అపార్ట్ మెంట్ లను నిర్మించింది. అందులో భాగంగా వరంగల్ లో రాంకీ విల్లా ఇన్ ఫ్రా సంస్థ నిర్మించిన అపార్ట్ మెంట్ లలో 102 ఫ్లాట్లను అఫర్డబుల్ హౌసింగ్ కింద అల్పాదాయ వర్గాల ప్రజలకే కేటాయించాలన్న నిర్ణయ మేరకు వీటిని మార్కెట్ కంటే తక్కువ ధరలకే అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. వీటిలో 33 ఫ్లాట్లు సుమారు 570 చదరపు అడుగుల (ఎస్ ఎఫ్ టి) విస్తీర్ణంలోనూ, 29 ఫ్లాట్లు 558 ఎస్ ఎఫ్ టి లోనూ, 40 ఫ్లాట్లు 609 ఎస్ ఎఫ్ టి విస్తీర్ణంలో ఉన్నాయని పేర్కొన్నారు. వీటి ధరలు కూడా రూ.19.60 లక్షల నుంచి 21.35 లక్షలకు వరకు ఉందని వివరించారు.

**నేడు (30 వ తేదీ) అధికారుల రాక**

ఈ ఫ్లాట్ల విక్రయం, కేటాయింపునకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడానికి రాంకీ ప్రాజెక్టు సైట్ వద్ద మంగళవారం నాడు (డిసెంబరు 30 వతేదీ) హౌసింగ్ బోర్డు అధికారులు అందుబాటులో ఉండనున్నారని ఆ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వరంగల్ కు వస్తున్నారని బోర్డు చీఫ్ ఇంజనీర్ శ్రీ రమణారెడ్డి , బోర్డు కార్యదర్శి శ్రీమతి ఎస్. విమల తెలిపారు. ఈ అధికారుల బృందం మంగళవారం ఉదయం (డిసెంబరు 30 వ తేదీ) 11.30 నుండి మధ్యాహ్నం 1.30 గం. లవరకు అందుబాటులో ఉంటారు. మార్కెట్ కంటే తక్కువ ధరల్లో అందుబాటులోకి వస్తున్న ఈ ఫ్లాట్లకు సంబంధించి దరఖాస్తు చేసుకునే విధానం, కేటాయింపు పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించడానికి, స్థానికుల సందేహాలను నివృత్తి చేసేందుకు అధికారుల బృందం అందుబాటులో ఉండనున్నారని ఆ ప్రకటనలో తెలిపారు. ఫ్లాట్ల కొనుగోలుకు ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని బోర్డు కార్యదర్శి విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో కేరళ మోడల్ పేదరిక నిర్మూలన

**పేదల గుర్తింపులో మహిళా సంఘాలదే కీలక పాత్ర**

**విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా సంక్షేమ పథకాల రూపకల్పన**

**మంత్రి సీతక్క కీలక ప్రకటన**





హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కేరళ మోడల్ అమలు దిశగా అధ్యయనం చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. కేరళ తరహాలో పేదరిక నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అత్యంత పేదలను గుర్తించడంలో మహిళా సంఘాలే కీలకం అని అన్నారు. అత్యంత పేదలను గుర్తించి ఇళ్లు, ఉపాధి, వైద్య సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఇటీవలే భారతదేశంలో తీవ్ర పేదరికాన్ని నిర్మూలించిన మొదటి రాష్ట్రంగా కేరళ అవతరించింది. దీనిని నవంబర్ 2025లో సీఎం పినరయి విజయన్ అధికారికంగా ప్రకటించారు. విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత, లక్ష్యిత జోక్యాలు మరియు సామాజిక భాగస్వామ్యం ద్వారా పేదరికం నుండి ప్రజలను బయటకు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. ఇదే తరహాలో తెలంగాణలోనూ చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## న్యూ ఇయర్ ఆఫర్ల పేరుతో సైబర్ మోసాలు

**జాగ్రత్త.. ఆ లింకులు క్లిక్ చేయకండి**

**ప్రజలకు శిఖాగోయల్ కీలక హెచ్చరిక**



హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): నూతన సంవత్సర శుభాకాంక్షలతో గిఫ్ట్‌లు, భారీ ఆఫర్ల పేరుతో వాట్సాప్‌లో సర్క్యులేట్ అవుతున్న లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ సూచించారు. వాట్సాప్‌లో వచ్చే నకిలీ గ్రీటింగ్స్, ఆఫర్ లింకులు ఏపికే ఫైల్స్ పట్ల రాష్ట్ర ప్రజలను హెచ్చరిస్తూ సోమవారం అడ్వైజరీ జారీ చేశారు. ఎస్‌బిఐ క్రెడిట్ కార్డ్ ఇయర్-ఎండ్ ఆఫర్లు, ఉచిత గిఫ్ట్‌లు, ట్రావెల్ డిస్కౌంట్లు, ఈవెంట్ టిక్కెట్ల పేరుతో మోసపూరిత లింకులను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలిపారు. ఈ లింకులను క్లిక్ చేయగానే ఫోన్‌లో తెలియకుండానే ఒక ప్రమాదకరమైన ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ అవుతుందని డేటా చోరి జరుగుతుందని పేర్కొన్నారు. మెసేజింగ్ యాప్స్ ద్వారా వచ్చే యాప్‌లను, ఏపికే ఫైల్స్ ఎప్పుడూ ఇన్‌స్టాల్ చేయవద్దని తెలిపారు. కేవలం అఫీషియల్ ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ మాత్రమే వాడండని సూచించారు. ఓటీపీలు, పిన్ నంబర్లు, సీవీవీ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. వాట్సాప్‌లో 'టూ-స్టెప్ వెరిఫికేషన్' ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకోవాలని సూచించారు. ఒకవేళ పొరపాటున ఇటువంటి లింకులను క్లిక్ చేస్తే, వెంటనే ఇంటర్నెట్ ఆఫ్ చేసి, అనుమానాస్పద యాప్‌లను డిలీట్ చేయాలని తెలిపారు. వెంటనే బ్యాంకుకు సమాచారం అందించి ఖాతాలను సురక్షితం చేసుకోవాలన్నారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఐకేపి మహిళ సంఘాల ఆధ్వర్యంలో సర్పంచ్ పంద్రం సుగుణకి ఆత్మీయ సన్మానం



బోథ్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పట్నాపూర్ గ్రామపంచాయతి ఎన్నికలలో వరుసగా రెండోసారి సర్పంచ్ గా ఎన్నికైన సర్పంచ్ పంద్రం సుగుణని ఐకేపి సిసి భాస్కర్ ఆధ్వర్యంలో మహిళ సంఘాల తరపున ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది ఈసందర్భంగా సిసి భాస్కర్ మాట్లాడుతూ జనరల్ స్థానం నుండి పోటీ చేసి మహిళా విజయం సాధించడం చాలా గర్వించదగ్గ విషయమని గతంలో సర్పంచ్ గా ఉండి గ్రామస్తులకు చేసిన అభివృద్ధి పనులే ఇంతటి మెజారికి కారణమైనయని ప్రజలు పనులు చేసే సర్పంచ్ లను ఎల్లపుడు ఆశీర్వదిస్తునే ఉంటారని తెలిపారు ఈ కార్యక్రమం లో సెక్రటరీ మిథున్ చక్రవర్తి సబ్ సెంటర్ డాక్టర్ ప్రియాంక ఏఎన్ఎం స్వప్న వివో అధ్యక్షురాలు తోడషం గంగామణి విఓఏ మాడవి శ్రీనివాస్ మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

## యువ సినీ సృజనకు ప్రజా ప్రభుత్వం ప్రోత్సాహం

**ఫిల్మ్ మేకర్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్ 29 (తీన్మార్ న్యూస్): సినిమా రంగానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని సంబందిత శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని వేదికగా సినిమాటోగ్రఫీ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన "బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్" అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. జ్యూరీ సభ్యులకు, అవార్డు విజేతలకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమం కేవలం పోటీ మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చిన గొప్ప వేదికగా నిలిచిందని కొనియాడారు. యువత సృజనాత్మకతకు ప్రోత్సాహం ఇస్తూ కళ, సంస్కృతి, సినిమారంగాలకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే ప్రయత్నాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా యువ కళాకారులకు పూర్తి మద్దతు అందిస్తామని భరోసా ఇచ్చారు.

## బోగస్ ఏజెంట్ల మోసంలో పడవద్దు

**అసెంబ్లీలో మంత్రి పొన్నం సూచన**

**హైదరాబాద్ :** బోగస్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రవాసుల సమస్యలు వినేందుకు ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. గల్ఫ్ వెళ్లే కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తున్నామని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా గల్ఫ్‌లో ఉన్న తెలంగాణ ప్రజల ఇబ్బందులను పలువురు సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా.. మంత్రి పొన్నం స్పందించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా విదేశాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో నైపుణ్యాలను బట్టి ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. టామ్ కామ్ ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచించిన ఆయన.. ఇందులో శిక్షణ తీసుకొని ఇతర దేశాల్లో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి చేశారు. నైపుణ్యం కలిగిన యువతకు గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గల్ఫ్ బాధితుల కోసం తెలంగాణలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంటే బావుంటుందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. అక్కడ కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. మన ఊరు-మన బడికి నిధులు రావడం లేదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ పునర్విభజనలో కొన్ని డివిజన్లలో ఓటర్ల శాతంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని.. వాటిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు.

# కెప్టెన్‌గా మళ్లీ రోహిత్‌శర్మ..?

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తిరిగి వన్డే సారథ్య బాధ్యతలు చేపట్టబోతున్నాడా? టీ20 జట్టు నుంచి తప్పించిన శుభ్‌మన్ గిల్ వన్డే కెప్టెన్సీపై వేటు పడనుందా? అంటే సోషల్ మీడియాలో అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ ఏడాదే కెప్టెన్‌గా రోహిత్ శర్మ ప్రయాణానికి తెరదించుతూ.. కొత్త కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ నియమించిన సంగతి తెలిసిందే.ఆస్ట్రేలియా పర్యటనతో శుభ్‌మన్ గిల్ వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. వన్డే ప్రపంచకప్ 2027 నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని అప్పట్లో సెలెక్టర్లు వివరణ ఇచ్చారు. వన్డే ప్రపంచకప్ 2027 వరకు కోహ్లీ, రోహిత్ జట్టులో కొనసాగడంపై సందేహాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కొత్త సారథిని సిద్దం చేయాలనుకున్నామని చెప్పారు. శుభ్‌మన్ గిల్‌కు వన్డే సారథ్య బాధ్యతలు అప్పగించారు. అయితే శుభ్‌మన్ గిల్ ఇటీవల పేలవ ఫామ్‌తో పాటు ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నాడు. దాంతో అతను టీ20 ప్రపంచకప్ 2026 ఎంపిక చేయలేదు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. ముఖ్యంగా మిడిలార్డర్‌ను బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఈ క్రమంలో ఓ సోషల్ మీడియా పోస్ట్ నెటిజన్లలో గందరగోళం స్పృష్టించింది. రోహిత్ శర్మను తిరిగి భారత వన్డే సారథిగా నియమించేందుకు బీసీసీఐ సిద్ధమైందని, ఇప్పటికే ఈ విషయమై రోహిత్ శర్మతో మాట్లాడిందని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. వన్డే ప్రపంచకప్ 2027లో టీమిండియాను రోహిత్ శర్మనే నడిపించబోతున్నాడని పేర్కొన్నారు. 'కెప్టెన్ రోహిత్ శర్మ ఈజ్ బ్యాక్. సెలెక్టర్లు అతనితో



మాట్లాడుతున్నారు. ప్రపంచకప్ నేపథ్యంలో వన్డే సారథ్య బాధ్యతలు చేపట్టాలని కోరుతున్నారు.'అని ఆ పోస్ట్‌లో తెలిపారు.

## 50 రికార్డులు నెలకొల్పిన రోహిత్ శర్మ

రోహిత్ శర్మకు 2025 సంవత్సరం అద్భుతంగా కలిసొచ్చింది. అతడి కెప్టెన్సీలో భారత్‌కు ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను అందించాడు. ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై రోహిత్ 76 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. అందుకుగానూ అతనికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. రోహిత్ శర్మ ఈ ఏడాది షాహిద్ అఫ్రిది పేరిట ఉన్న ఒక పెద్ద రికార్డును బద్దలు కొట్టాడు. పాకిస్థాన్ బ్యాట్స్‌మెన్ గత 10 సంవత్సరాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్నాడు. వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాట్స్‌మెన్‌గా రోహిత్ నిలిచాడు. రోహిత్ ఖాతాలో ప్రస్తుతం 355 వన్డే సిక్స్‌లు ఉన్నాయి. అఫ్రిది 351 సిక్స్‌లు కొట్టాడు.రోహిత్ శర్మ సేనా దేశాలలో (దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) అత్యధిక సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అతను మొత్తం 14 వన్డే సెంచరీలు సాధించాడు.భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఓపెనర్ (15,933). ఓపెనర్‌గా భారత్ తరపున సంయుక్తంగా అత్యధిక సెంచరీలు (45). సచిన్ సైతం ఓపెనర్‌గా ఇదే రికార్డ్.



# అండర్- 19 వరల్డ్‌కప్ కెప్టెన్‌గా ఆయూశ్ మాత్రే

## అండర్- 19 వరల్డ్‌కప్ భారత్ జట్టు ప్రకటన

2026 అండర్ 19 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌కు భారత జట్టును బీసీసీఐ తాజాగా ప్రకటించింది. 15 మందితో కూడిన జట్టును బోర్డు శనివారం అనౌన్స్ చేసింది. ఈ జట్టుకు ఆయూశ్ మాత్రే కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. విహాన్ మల్హోత్ర వైస్ కెప్టెన్‌గా ఎంపికైయ్యాడు. ఈ జట్టులో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కూడా ఉన్నాడు. అయితే వరల్డ్‌కప్ కంటే ముందు యంగ్ టీమ్‌ఇండియా, సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌లో ఆడనుంది. ఆ సిరీస్‌కు కూడా ఇదే జట్టుతో భారత్ బరిలోకి దిగనుంది.కాగా, ఈ వరల్డ్‌కప్ టోర్నమెంట్ జనవరి 15న ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 06న ఫైనల్‌తో ముగుస్తుంది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. 5సార్లు ఛాంపియన్ అయిన టీమ్‌ఇండియా ఈ టోర్నీలో టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. భారత్ గ్రూప్ బీలో ఉంది. భారత్‌తోపాటు ఈ గ్రూప్‌లో న్యూజిలాండ్, యుఎస్‌ఏ మరియు బంగ్లాదేశ్ ఉన్నాయి.ఈ టోర్నమెంట్‌లో భారత్ సహా 16 జట్లు పాల్గొననున్నాయి. ఈ జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ముందుగా గ్రూప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. తర్వాత ఆ తర్వాత సూపర్ సిక్స్ దశ మ్యాచ్‌లు ఉంటాయి. ఆ తర్వాత సెమీ-ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఫైనల్ మ్యాచ్‌లు హరారే ఆతిథ్యమివ్వనుంది.ఈ వరల్డ్‌కప్‌లో భారత్ తన తొలి మ్యాచ్ %ఖూూా%తో ఆడనుంది. జనవరి 15న బులావాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత కూడా అదే వేదికపై 17న బంగ్లాదేశ్‌తో, జనవరి 24న న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియా గ్రూప్ మ్యాచ్‌లు ఆడనుంది. కాగా, అండర్ 19 వరల్డ్‌కప్‌లో టీమ్‌ఇండియా ఇప్పటిదాకా ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచింది. 2000, 2008, 2012, 2018, 2022 ఎడిషన్లలో భారత్ టైటిళ్లు నెగ్గింది. నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచింది. ఆయుశ్ మత్రే, విహాన్ మల్హోత్ర ఇద్దరు ఆటగాళ్లు మణికట్టు గాయాలకు గురయ్యారు. దీంతో దక్షిణాఫ్రికా పర్యటనకు ఈ ఇద్దరూ దూరం కానున్నారు. దీంతో ఈ సిరీస్‌కు వైభవ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇక ఆయూశ్, విహాన్ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కొన్ని రోజులు ఉండి చికిత్స తీసుకుంటారు. అయితే అండర్- 19 ప్రపంచ కప్ సమయానికి మళ్లీ ఈ ఇద్దరూ జట్టులో చేరతారు.భారత్‌కు ఇప్పటికాదా ఐదుగురు కెప్టెన్లు అండర్ - 19 టైటిల్ అందించారు. గతంలో మహ్మద్ కైఫ్ (2000), విరాట్ కోహ్లీ (2008), ఉన్ముక్త్ చంద్ (2012), పృథ్వీ షా (2018), యష్ దుల్ (2022) టీమ్‌ఇండియాను ఛాంపియన్‌గా నిలిపారు. ఇప్పుడు ఈ లిస్ట్‌లో ఆయూశ్ మాత్రే కూడా చేరాలని టీమ్‌ఇండియా ఫ్యాన్స్ భావిస్తున్నారు.

భారత యు19 జట్టు : ఆయుశ్ మాత్రే (కెప్టెన్), విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, ఆరోన్ జార్జ్, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు (వికెట్ కీపర్), హర్వాన్ష్ సింగ్ (వికెట్ కీపర్), అంబరీష్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ ఎ. పటేల్, మహ్మద్ ఈనాన్, హెనిల్ పటేల్, డి. దీపేష్, కిషన్ కుమార్ సింగ్, ఉదవ్ మోహన్

# రవి సింగ్ రికార్డు ఇన్నింగ్స్

విజయ్ హజారే ట్రోఫీలో సిక్సర్ల సునామీ కొనసాగుతోంది. ఐపీఎల్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని సైతం వెనక్కి నెట్టి రైల్వేస్ వికెట్ కీపర్ బ్యాటర్ రవి సింగ్ కొత్త సిక్సర్ కింగ్‌గా అవతరించాడు. కేవలం మూడు ఇన్నింగ్స్‌ల్లోనే ఏకంగా 19 భారీ సిక్సర్లు బాది అందరినీ ఆశ్చర్యపరిచాడు. లెఫ్ట్ హ్యాండ్ కలిగిన ఈ పవర్‌ఫుల్ బ్యాటర్ తన వినాశకరమైన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు పీడకలలా మారాడు. ఈ సీజన్ విజయ్ హజారే ట్రోఫీలో రవి సింగ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. సర్వీసెస్ జట్టుతో జరిగిన తాజా మ్యాచ్‌లో కేవలం 46 బంతుల్లోనే 88 పరుగులు సాధించాడు. ఇందులో ఏకంగా 7 సిక్సర్లు ఉన్నాయి. అంతకుముందు వైభవ్ సూర్యవంశీ 16 సిక్సర్లతో టాప్‌లో ఉండగా, ఇప్పుడు రవి సింగ్ ఆ రికార్డును దాటి 19 సిక్సర్లతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. కేవలం మూడు ఇన్నింగ్స్‌ల్లోనే 273 పరుగులు చేసిన రవి సింగ్ సగటు 136.5గా ఉండటం విశేషం. అతని స్ట్రైక్ రేట్ 138కి పైగా ఉండటం చూస్తుంటే, వన్డే మ్యాచ్‌ను కూడా టీ20లా మార్చేస్తున్నాడని అర్థమవుతోంది. రవి సింగ్ ఫామ్ చూస్తుంటే ఎవరూ అతడిని ఆపలేకపోతున్నారు. హర్యానాతో జరిగిన మ్యాచ్‌లో 81 బంతుల్లోనే అజేయమైన 109 పరుగుల సెంచరీతో రైల్వేస్ జట్టును గెలిపించాడు. ఆ తర్వాత బలమైన ఆంధ్రప్రదేశ్ జట్టుపై 70 బంతుల్లో 76 పరుగులు చేసి తన నిలకడను చాటుకున్నాడు. తాజాగా సర్వీసెస్‌పై 46 బంతుల్లోనే 88 పరుగులు బాది తన విధ్వంసకర ఇన్నింగ్స్‌ల పరంపరను కొనసాగించాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ రవి సింగ్ 50కి పైగా పరుగులు సాధించడం విశేషం. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు రవి సింగ్ ప్రతిభను గుర్తించి 95 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది. యూపీ టీ20 లీగ్‌లో కూడా రవి తన పవర్ హిట్టింగ్‌తో ఆకట్టుకున్నాడు. వికెట్ కీపింగ్‌తో పాటు మ్యాచ్‌ను ఫినిష్ చేయగల సత్తా ఉండటంతో ఐపీఎల్ 2026 సీజన్లో అతడు రాజస్థాన్ జట్టులో కీలక ఆటగాడిగా మారే అవకాశం ఉంది. రియాన్ పరాగ్, సంజూ శాంసన్ వంటి ఆటగాళ్లతో కలిసి రవి సింగ్ ఐపీఎల్ గ్రౌండ్లలో సిక్సర్ల వర్షం కురిపిస్తాడని ఫ్యాన్స్ ఆశగా ఎదురుచూస్తున్నారు. రవి సింగ్ ఇన్నింగ్స్‌లు రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్‌ను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. ఈ స్థాయి ఫామ్‌ను కొనసాగిస్తే త్వరలోనే టీమ్ ఇండియా తలుపులు తట్టడం ఖాయం. అద్భుతమైన టైమింగ్, భీకరమైన పవర్ తో బంతిని స్టాండ్స్ లోకి పంపడంలో రవి సింగ్ ఇప్పుడు దేశవాళీ క్రికెట్ లో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారాడు.

# నెహ్రూ స్టేడియం కూల్చివేతకు గ్రీన్ సిగ్నల్



అసోం క్రీడా చరిత్రలో ఒక శకం ముగియబోతోంది. దాదాపు 60 ఏళ్ల పాటు ఎన్నో అద్భుత ఘట్టాలకు వేదికగా నిలిచిన గువాహటిలోని నెహ్రూ స్టేడియం త్వరలోనే కనుమరుగు కానుంది. అసోం క్రీడలకు ఒక గుండెలా నిలిచిన ఈ స్టేడియాన్ని పూర్తిగా కూల్చివేసి, దాని స్థానంలో అత్యాధునిక హంగులతో కొత్త స్టేడియాన్ని నిర్మించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ భారీ మార్పుకు అసోం క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. పాత జ్ఞాపకాలను చెరిపేసి సరికొత్త ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌గా దీన్ని మార్చబోతున్నారు.ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణాలను పూర్తిగా తొలగించి, ఫిఫా అలాగే ఒలింపిక్ ప్రమాణాలకు తగ్గట్లుగా ఈ కొత్త స్టేడియాన్ని తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం అసోం ప్రభుత్వం ఏకంగా రూ. 765 కోట్లు కేటాయించింది. ఈ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ పనులను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి దక్కించుకుంది. పాత స్టేడియం స్థానంలో ఫుట్ బాల్ గ్రౌండ్, ప్రాక్టీస్ ఫీల్డ్స్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ వంటి ఆధునిక సౌకర్యాలు రాబోతున్నాయి. అయితే కొత్త స్టేడియానికి పేరు మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అసలు ఈ స్టేడియం కథ 1962లో మొదలైంది. 1962 జూలై 16న అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరు మీద దీన్ని ప్రారంభించారు. దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ స్టేడియం అప్పట్లో ఈశాన్య భారతంలోనే అతిపెద్ద ఔట్ డోర్ స్టేడియంగా పేరు తెచ్చుకుంది. అసోం క్రికెట్ అసోసియేషన్‌కు, అక్కడి క్రీడాకారులకు ఇది ఎంతోకాలం ప్రధాన కేంద్రంగా సేవలు అందించింది. రాధా గోవింద బారువా వంటి ప్రముఖులు దీని నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు.క్రికెట్ అభిమానులకు ఈ స్టేడియంతో విడదీయరాని అనుబంధం ఉంది. 1983లో ఇక్కడ భారత్, వెస్టిండీస్ మధ్య తొలి వన్డే మ్యాచ్ జరిగింది. మొత్తంగా 14 అంతర్జాతీయ వన్డేలకు ఈ మైదానం ఆతిథ్యం ఇచ్చింది. సచిన్ తెందూల్కర్, కపిల్ దేవ్, సునీల్ గావస్కర్, వివియన్ రిచర్డ్స్, సౌరభ్ గంగూలీ వంటి దిగ్గజాలు ఇక్కడ ఆడారు. చివరిసారిగా 2010లో భారత్- న్యూజిలాండ్ మధ్య ఇక్కడ మ్యాచ్ జరిగింది. కేవలం క్రికెట్ మాత్రమే కాకుండా ఫుట్ బాల్ చరిత్ర కూడా ఈ స్టేడియానికి ఉంది. కేవలం క్రికెట్, ఫుట్‌బాల్ మాత్రమే కాకుండా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, హాకీ, జూడో వంటి అనేక క్రీడలకు ఇది ప్రధాన వేదికగా నిలిచింది. అసోం స్పోర్టింగ్ లైఫ్‌కు ఇది సెంటర్ పాయింట్ అని చెప్పవచ్చు. క్రీడలతో పాటు లతా మంగేష్కర్, మహమ్మద్ రఫీ వంటి గాయకుల కచేరీలు, రాజకీయ సభలు కూడా ఇక్కడ జరిగాయి. గత ఆరు దశాబ్దాలుగా అసోం ప్రజల సామాజిక జీవితంలో ఈ నెహ్రూ స్టేడియం ఒక భాగమైపోయింది.ఇప్పుడు పునర్నిర్మాణ పనుల కోసం డిసెంబర్ 25 లోపు స్టేడియం కాంప్లెక్స్‌లోని ఆఫీసులన్నీ ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కొత్తగా రాబోయే స్టేడియంలో సుమారు 25 వేల మంది కూర్చునే సామర్థ్యం ఉంటుంది. ఆడిటోరియం, స్పోర్ట్స్ హాస్టల్, కమర్షియల్ స్పేస్ లు కూడా ఇందులో ఉంటాయి. పాత స్టేడియం కూలిపోయినా, అది మిగిల్చిన క్రీడా జ్ఞాపకాలు మాత్రం చరిత్ర పుటల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయి.

# సొంత బోర్డుపై దావా వేసిన సౌతాఫ్రికా క్రికెటర్!




సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు (సీఎస్ఏ) పై ఆ జట్టు సీనియర్ ప్లేయర్ తబ్రైజ్ షమ్సీ దావా వేసాడు. ఈ న్యాయ పోరాటంలో అతనికి అనుకూలంగా తీర్పు రావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక ఆటగాడు తమ సొంత బోర్డుపై న్యాయ పోరాటం చేసి ఊరట పొందడం ఇదే తొలిసారి.యూఏఈ వేదికగా జరుగుతున్న ఐఎల్‌టీ20లో ఆడేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌ఓసీ) గడువును పెంచాలని కోరుతూ షమ్సీ దాఖలు చేసిన పిటిషన్‌పై జోహన్నెస్‌బర్గ్ హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. షమ్సీ ఈ ఏడాది ఆరంభంలోనే సౌతాఫ్రికా20 ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ కేప్‌టౌన్‌తో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్నాడు. ఆ తర్వాత ఆయన గల్ఫ్ జెయింట్స్ తరపున ఐఎల్‌టీ20 ఆడేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే ఐఎల్‌టీ20 ఆడేందుకు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు ఎన్‌ఓసీ జారీ చేసింది. కానీ డిసెంబర్ 19 వరకే ఇచ్చింది. జనవరి 4న జరిగే ఐఎల్‌టీ20 ఫైనల్ వరకు ఆడేందుకు అతనికి అనుమతి నిరాకరించింది.సౌతాఫ్రికా క్రికెట్ బోర్డుతో షంసీ జరపిన చర్చలు సఫలం కాకపోవడంతో అతను హైకోర్టును ఆశ్రయించాడు. అతని పిటిషన్‌ను విచారించిన కోర్టు జనవరి 4 వరకు ఎన్‌ఓసీని పొడిగించడమే కాకుండా.. షమ్సీకి అయిన లీగల్ ఖర్చులను కూడా చెల్లించాలని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డును ఆదేశించింది.ఈ తీర్పుపై షమ్సీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. 'కోర్టు నా పరిస్థితిని అర్థం చేసుకుని ఊరటనిచ్చినందుకు కృతజ్ఞతలు. బోర్డుపై కేసు వేయడం నాకు ఇష్టం లేదు. కానీ నా కెరీర్, కుటుంబ భవిష్యత్తు దృష్ట్యా ఈ నిర్ణయం తప్పలేదు. ఇది కేవలం డబ్బు కోసం చేస్తున్న పని కాదు. నా వృత్తిపరమైన బాధ్యతలను నెరవేర్చుకోవడం కోసమే. నేను ఇప్పటికీ సౌతాఫ్రికా జట్టుకు ఆడేందుకు సిద్ధంగానే ఉన్నాను.'అని షంసీ తెలిపాడు. షమ్సీ ILT20 ముగిసిన వెంటనే ఆస్ట్రేలియాలో బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో పాల్గొనేందుకు కూడా బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొందాడు.


# టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్‌శర్మ విధ్వంసం

టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసం సృష్టించాడు. జైపూర్ వేదికగా జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో ఈ వరల్డ్ నెంబర్ వన్ టీ20 బ్యాటర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 60 నిమిషాల వ్యవధిలో ఏకంగా 45 సిక్సర్లు బాది ప్రత్యర్థి బౌలర్లకు ముందస్తు హెచ్చరికలు పంపాడు. విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అభిషేక్ శర్మ.. ఆదివారం ఉదయం జైపూర్ శివార్లలోని క్రికెట్ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేశాడు. ఈ ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ శర్మ సిక్సర్ల సునామీ సృష్టించాడు. బౌలర్లపై 'రుద్ర తాండవం' చేశాడు. ఈ ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ శర్మ హిట్టింగ్‌పైనే దృష్టి సారించాడు. సుమారు గంట పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన అభిషేక్ శర్మ.. ఒక్క బంతిని కూడా డిఫెండ్ చేయలేదు. ఆఫ్-స్పిన్, లెగ్-స్పిన్ అని తేడా లేకుండా బౌలర్లు వేసిన బంతులని స్టాండ్స్‌లోకి పంపాడు.అభిషేక్ శర్మ సిక్సర్ల ధాటికి కనీసం 5 బంతులు మైదానానికి ఆనుకుని ఉన్న అపార్ట్‌మెంట్స్‌లో పడ్డాయి. ముఖ్యంగా 'ఎక్స్‌ట్రా కవర్' దిశగా అభిషేక్ ఆడిన ఇన్ సైడ్-ఔట్ షాట్లు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి.అభిషేక్ పూర్తిగా ఎక్స్‌ట్రా కవర్ మీదుగా సిక్సర్లు బాదడంతో పంజాబ్ హెడ్ కోచ్ సందీప్ శర్మ పంజాబీలో సరదాగా స్పందించాడు. 'ఏంటి అభిషేక్.. ఎక్స్‌ట్రా కవర్ సిక్సర్లతోనే సెంచరీ చేస్తావా?'అని చమత్కరించగా.. అభిషేక్ తనదైన శైలిలో నవ్వుతూ మరో సిక్సర్‌తో బదులిచ్చాడు. ప్రాక్టీస్ మొదలైన 10 నిమిషాలకే అభిషేక్ తన హిట్టింగ్ మొదలుపెట్టాడు. సహచర ఆటగాడు గౌరవ్ చౌదరిని "ఫీల్డింగ్ సెటప్ ఎలా ఉంది?" అని ఒక ఊహాత్మక ప్రశ్న అడిగి, దానికి అనుగుణంగా బంతిని స్టాండ్‌కు తరలించాడు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ఈ గంట సేపట్లో ఆయన కేవలం 3 లేదా 4 సార్లు మాత్రమే ఔట్ అయ్యారు. అది కూడా డిఫెన్స్ ఆడటానికి ప్రయత్నించినప్పుడే కావడం గమనార్హం. 25 ఏళ్ల అభిషేక్ శర్మ చూపించిన ఈ విధ్వంసం రాబోయే అంతర్జాతీయ మ్యాచుల్లో టీమిండియా పవర్ ప్లేలో ఏ రేంజ్‌లో చెలరేగబోతుందో చెప్పడానికి సంకేతం. న్యూజిలాండ్‌తో జరగబోయే అప్‌కమింగ్ టీ20 సిరీస్‌లో అభిషేక్ శర్మ ఈ దూకుడు కొనసాగించాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.



# రాజాసాబ్‌పై భారీ అంచనాలు

## రాజాసాబ్ నుంచి మరో ట్రైలర్ విడుదల



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన తాజా చిత్రం 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా, ఇటీవల గ్రాండ్‌గా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. 'బాహుబలి', 'సలార్', 'కల్కి' లాంటి భారీ పాన్ ఇండియా చిత్రాలతో ప్రభాస్ స్టార్‌డమ్ మరో స్థాయికి చేరిన సంగతి తెలిసిందే. అయితే ప్రభాస్‌లోని కామెడీ టైమింగ్‌ను వెండితెరపై చూసి చాలా కాలమే గడిచిపోయింది. చివరిసారిగా 'డార్లింగ్' చిత్రంలో ప్రభాస్ తన ఫన్ యాంగిల్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాడు. దాదాపు 15 ఏళ్ల తర్వాత, మళ్లీ అదే స్థాయిలో కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రభాస్ కనిపించనున్నాడనే టాక్‌తో 'రాజా సాబ్'పై అంచనాలు భారీగా పెరిగాయి. పండగ సీజన్‌లో విడుదల కావడంతో ఈ సినిమా ఓ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలవనుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా, 'రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో జరిగిన ఓ ఆసక్తికర ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న మారుతి కుమార్తె హియా దాసరి, ఈవెంట్‌లో ప్రభాస్‌ను పలకరిస్తున్న వీడియో నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ప్రభాస్ కూర్చుని ఉండగా వెనుక నుంచి వచ్చిన హియాను ఆయన ఎంతో ఆప్యాయంగా రిసీవ్ చేసుకుని మాట్లాడిన తీరు అభిమానుల మనసులను గెలుచుకుంది. ఈ మధురమైన క్షణాలను హియా స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ, 'హీరో గారు? మీరు నిజంగా ఎంతో మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి' అంటూ ఎమోషనల్ పోస్ట్ చేసింది. దీనిపై దర్శకుడు మారుతి కూడా లవ్ ఎమోజీలతో రియాక్ట్ అయ్యారు. అంతేకాదు, ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న నిధి అగర్వాల్ కూడా ఈ పోస్ట్‌పై స్పందించడం విశేషం. 'రాజా సాబ్' చిత్రంలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఫన్, రొమాన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం, ప్రభాస్ అభిమానులకు నిజమైన పండగ కానుక అవుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే? 'డార్లింగ్' తర్వాత ప్రభాస్ కామెడీ మ్యాజిక్‌ను 'రాజా సాబ్' ఎంత స్థాయిలో రిపీట్ చేస్తాడనేది చూడాలి.

# పొట్టి డ్రెస్‌లో నభా అందాలు

ఒకప్పుడు భాషతో సంబంధం లేకుండా వరస చిత్రాలలో అవకాశాలు అందుకొని.. సడన్గా అవకాశాలు తగ్గిపోయి మళ్లీ ఇప్పుడు అవకాశాల కోసం ఎదురుచూస్తున్న హీరోయిన్స్ లో నభా నటేష్ కూడా ఒకరు. ముఖ్యంగా అవకాశాల కోసం ఎదురుచూడడంలో భాగంగానే సోషల్ మీడియా వేదికగా అందాలు వలకబోస్తూ అభిమానులను అటు దర్శక నిర్మాతలను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా బ్లాక్ కలర్ పొట్టి డ్రెస్ ధరించి.. అందాలు ఆరబోస్తూ అభిమానులను అలరించే ప్రయత్నం చేసింది ఈ ముద్దుగుమ్మ. బ్లాక్ కలర్ మినీ టాప్ అండ్ షార్ట్ తో నడుము అందాలను హైలెట్ చేస్తూ షేర్ చేసిన ఫోటోలు ఇంస్టాగ్రామ్ లో మంట రాజేస్తున్నాయి. మొత్తానికైతే ఈ మధ్యకాలంలో గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నభా నటేష్ మరోసారి తన అందాలతో మెస్మరైజ్ చేస్తోంది. ప్రస్తుతం ఈమె ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన ఫోటోలకు అభిమానులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా నభాకి అవకాశాలు వస్తాయేమో చూడాలి. నన్ను దోచుకుందువటే అనే సినిమా ద్వారా హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమయ్యింది ఈ ముద్దుగుమ్మ..
సుధీర్ బాబు హీరో గా వచ్చిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. 2018లో వచ్చిన ఈ సినిమా కంటే ముందే కొన్ని కన్నడ సినిమాలలో కూడా నటించింది. ఇక పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా నటించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో హీరోయిన్ గా నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయింది. ఇందులో తన అందంతో నటనతో మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా ఈ సినిమాలో గ్లామర్ తో ఆకట్టుకోవడంతో ఆ తర్వాత కొన్ని సినిమాలలో అవకాశాలు లభించాయి. అలా డిస్కో రాజా, అదుగో, అల్లుడు అదుర్స్, సోలో బ్రతుకే సో బెటర్, మాస్ట్రో ఇలా తదితర సినిమాలలో నటించి అభినయంతో మంచి మార్కులు వేయించుకుంది.



# గ్లామర్ డోస్ పెంచేసిన జూ.సమంత

ఆషు రెడ్డి.. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో జూనియర్ సమంతగా తనకంటూ ఒక పేరును సొంతం చేసుకుంది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ఫోటోలు షేర్ చేసే ఈమె.. తాజాగా మరో ఫోటోషూట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ముఖ్యంగా బ్లేజర్ ను తలపించేలా గోల్డెన్ కలర్ డ్రెస్ ధరించిన ఈమె.. అందులో తన అందాలు చూపిస్తూ బ్లాస్ట్ చేసింది. ముఖ్యంగా అందాలే హైలెట్ గా షేర్ చేసిన ఈ ఫోటోలకు కుర్రకారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిజానికి ఈ మధ్యకాలంలో ఎక్కువగా ఇలా గ్లామర్ షో చేస్తూ ఫాలోవర్స్ ను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది ఆషు రెడ్డి. దీనికి తోడు ఇప్పుడు మరొకసారి అందాలు ఆరబోస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు నెట్టింట హాట్ టాపిక్ గా మారాయని చెప్పవచ్చు. ప్రస్తుతం ఈ అమ్మడు అందాలతోనే అభిమానులను ఆకట్టుకుంటోంది.ఆషు రెడ్డి తెలుగు నటి మాత్రమే కాదు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గా కూడా భారీ పాపులారిటీ అందుకుంది. ముఖ్యంగా బిగ్ బాస్ తెలుగు సీజన్ 3 తో పాటు బిగ్ బాస్ ఓటీటీ నాన్ స్టాప్ లలో కూడా పాల్గొని మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది.

అందం , ఫ్యాషన్, టాలెంట్ తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటూ పలు ఇంటర్వ్యూలు , ఫోటోషూట్లతో పాటు సినిమాలలో కూడా నటిస్తూ మరింత బిజీగా మారిపోయింది.ఇంస్టాగ్రామ్ వేదికగా మిలియన్ల కొద్ది ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈమె ఆ సంఖ్యను మరింత పెంచుకోవడానికి తరచూ ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ నిత్యం ట్రెండింగ్ లో నిలుస్తోంది.

# మార్చి 6న అల్లు శిరీష్ వివాహం



నటుడు అల్లు శిరీష్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. తన ప్రియురాలు నయనికతో అక్టోబర్‌లో నిశ్చితార్థం ఘనంగా జరిగింది. తాజాగా శిరీష్ తన పెళ్లి తేదీని వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. ఇన్‌స్టాలో ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అయాన్, అర్హలతో రీల్ చేస్తూ అధికారికంగా చెప్పారు. 'బాబాయ్ సంగీత్ ఎప్పుడు ఉంటుంది' అని వాళ్లు అడగ్గా.. 'మనం దక్షిణాది వాళ్లం.. అలాంటివి చేసుకోం' అని శిరీష్ అన్నారు. అయితే, పెళ్లి ఎక్కడ జరుగుతుంది అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇక అల్లు అర్జున్ - స్నేహారెడ్డి వివాహం కూడా 2011లో మార్చి 6నే జరగడం విశేషం. శిరీష్-నయనికల ప్రేమ ప్రయాణం వరుణ్- లావణ్యల పెళ్లి సమయంలో ప్రారంభమైంది. వీరి పెళ్లికి నటుడు నితిన్ సతీమణి షాలినితో కలిసి హాజరయ్యారు. షాలినితో ఆమె స్నేహితురాలు నయనిక కూడా వచ్చారు. తొలిసారి ఆమెను అప్పుడే చూసినట్లు శిరీష్ తెలిపారు. ఆ పరిచయం స్నేహంగా మారి ఇద్దరి మధ్య ప్రేమ చిగురించినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. 'మా పరిచయం ఎలా మొదలైందంటూ ఏదోఒక రోజు మా పిల్లలు అడిగితే ఇదే చెబుతా. నన్ను తమ సర్కిల్‌లో చేర్చుకున్న నయనిక స్నేహితులందరికీ థాంక్స్' అని చెప్పారు.

# బడ్జెట్ పెరగడంతోనే టిక్కెట్ల రేట్లు పెరుగుదల

## నిర్మాత నాగవంశీ వెల్లడి



సినిమా బడ్జెట్ ఆధారంగానే టికెట్ ధరలు పెంచుతున్నామని ఎవరినీ దోచేయడానికి కాదని నిర్మాత నాగవంశీ చెప్పారు. తాము బతికేదే ఇండస్ట్రీ మీద అని అలాంటప్పుడు టికెట్ ధరలు పెంచి ప్రేక్షకులు థియేటర్‌లకు రాకుండా ఎందుకు చేస్తామని అన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన టికెట్ ధరల గురించి ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇటీవల కొన్ని సినిమాలకు టికెట్ ధర రూ.99 నిర్ణయించారు. ఆ చిత్రాలు చిన్నవి కాబట్టి వాటికి ఆ ధర పెట్టినా కూడా బ్జడెట్‌కు సరిపడా ఓపెనింగ్స్ వచ్చేస్తాయి. అలాగే రూ.100కోట్లు, రూ.500కోట్లు ఖర్చుపెట్టి తీస్తున్నప్పుడు దాని ప్రకారం టికెట్ రేట్లు పెంచుతాం. అంత భారీ చిత్రాలకు కూడా రూ.99 ఉంటే సంవత్సరం ఆడితేగానీ రికవరీ అవ్వదు. ఇది సింపుల్ టాపిక్ దాన్ని చాలా పెద్దది చేసి మాట్లాడుతున్నారు. జనాలను దోచేయాలని నిర్మాతలెవరూ అనుకోరు. బ్జడెట్ ఎక్కువ ఉన్నవాటికి మాత్రమే ధరలు పెంచుతున్నామని అందరూ అర్థం చేసుకోవాలని అన్నారు. సినిమా ప్రచారాల గురించి నాగవంశీ మాట్లాడుతూ.. 'సానుభూతి చూపిస్తే హిట్ అవుతుందనే అబద్ధం. అలాంటి జిమిక్కుల వల్ల ఒకటి, రెండు సినిమాలు హిట్ అవుతాయేమో కానీ ప్రతి దానికి అవి పనిచేయవు. ప్రచారంలో మాట్లాడిన మాటలు చూసి వచ్చేలా జనాలు లేరు. కథ బాగుంటే ప్రేక్షకులు ఎలాగైనా చూస్తారు. 'లిటిల్ హార్ట్స్' చిన్న చిత్రమే అయినా పెద్ద విజయం సాధించింది కదా.. ఒక మూవీని తొక్కేస్తున్నారు అనేది కూడా వాస్తవం కాదు. హిట్ చేయాలా లేదా అనేది పూర్తిగా ప్రేక్షకుల చేతుల్లోనే ఉంటుంది' అని నాగవంశీ చెప్పారు.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463